తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
మంగళవారం
01 సెప్టెంబర్ 2026

# నీట్ పీజీ ప్రవేశ పరీక్షకు పటిష్ట పోలీసు బందోబస్తు

## పరీక్షా కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఎస్పీ



**మహబూబ్‌నగర్, ప్రతినిధి ఆగస్టు 31(జనంసాక్షి):** నీట్ పీజీ (NEET-PG) ప్రవేశ పరీక్షను జిల్లాలో ప్రశాంతమైన, సురక్షిత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు చేపట్టిన పోలీసు బందోబస్తు మరియు భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ డి.జానకి, క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీ మధుసూదన్ నాయక్ ఎస్పీ తో కలిసి పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు ఫాతిమా విద్యాలయం మరియు జీూచీజజు ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన నీట్ పీజీ పరీక్షా కేంద్రాలను సందర్శించి, పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా చర్యలు, ప్రవేశ ద్వారాల వద్ద పోలీసు సిబ్బంది విధులు, పరీక్షా కేంద్రాల పరిసరాల్లో పోలీసుల పర్యవేక్షణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు.

పరీక్షా కేంద్రాల వద్ద విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఎస్పీ సూచించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పోలీసు సిబ్బంది విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. పరీక్షా కేంద్రాల భద్రత, శాంతి భద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాల్లో ఎలాంటి లోపాలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద విధులు నిర్వహించే ప్రతి పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, అప్రమత్తత, సమయపాలనతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు. జిల్లాలో నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా, సురక్షితంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సజావుగా జరిగేలా మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ పూర్తి స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా ఎస్పీ డి.జానకి, తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీ మధుసూదన్ నాయక్ పరీక్షా కేంద్రాల్లోని ఏర్పాట్లను పరిశీలించి, సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు జారీ చేశారు. ఈ సందర్శనలో AR అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఋూా వెంకటేశ్వర్లు, రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గాంధీ నాయక్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట బ్యూరో, ఆగస్టు 31(జనంసాక్షి):**
ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ఆయా శాఖల వారిగా ఆన్లైన్లో ప్రజావాణి దరఖాస్తుల పెండింగ్ వివరాలను గూర్చి సమీక్ష నిర్వహిస్తూ, ప్రజలు ఎంతో నమ్మకంతో తమ సమస్యలను అధికారులకు తెలిపి పరిష్కరించుడోవడానికి ప్రజావాణికి వస్తారని ఆ నమ్మకాన్ని ప్రజలకు కల్పించేలా పనిచేయాలని ఆదేశించారు. ఆయా శాఖల్లో ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే డిస్పోసల్ చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలో పరిష్కారం కోసం వచ్చేసిన ప్రజల నుండి మొత్తం 103 దరఖాస్తులు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, ఎస్‌డిసి సుదర్శన్ రెడ్డి జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి: కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో ఆగస్టు 31(జనంసాక్షి):** ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లోని ప్రజా వాణి సమావేశ మందిరం లో సోమవారం నిర్వహించి న ప్రజావాణి కార్యక్రమానికి 5 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యల ను జిల్లా కలెక్టర్ కు విన్నవి స్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో పెట్ట కుండా సత్వరం పరిష్కరిం చాలన్నారు. శాఖల వారీగా ఆయా అర్జీలను ఎప్పటిక ప్పుడు పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు.
అదనపు కలెక్టర్ శ్రీను, డి.ఆర్.ఓ.రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లాలో

## నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీస్ యాక్ట్

- **అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు, సభలు నిర్వహించొద్దు**
- **జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 31(జనంసాక్షి):**
శాంతిభద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీస్ యాక్ట్--1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు.

ఈ మేరకు జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగులు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా లేదా ప్రజాధనానికి నష్టం వాటిల్లే విధంగా ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దని హెచ్చరించారు.

జిల్లాలో శాంతియుత వాతావరణం కొనసాగేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని ఎస్పీ పరితోష్ పంకజ్ కోరారు. పోలీసుల అనుమతి లేకుండా నిషేధిత కార్యకలాపాలు నిర్వహించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# కొంగోడు గ్రామం ఎర్రకుంట కింది భాగంలో ఇసుకాసూరుల స్వైర విహారం!

- **ఇసుకాసూరుల ఇష్టా రాజ్యం.. అధికారుల మౌనం!**
- **రూ.2లక్షలతో నాటిన మొక్కలలో వందల మొక్కలు ధ్వంసం..**
- **ఎంపీడీవో సమక్షంలో జరిగిన గ్రామసభలో రసాబస..**



**కొల్చారం, ఆగస్టు 31 (జనంసాక్షి):** కొల్చారం మండలంలోని కొంగోడ్ గ్రామంలో ఇసుక అక్రమ రవాణాదారుల నిర్వాకం వెలుగులోకి వచ్చింది. గ్రామంలోని ఎర్రకుంట కింది భాగంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మొక్కల పెంపకం కార్యక్రమంలో భాగంగా సుమారు 4 వేల మొక్కలను రూ.2 లక్షల వ్యయంతో 15 రోజుల క్రితం నాటినట్లు గ్రామస్తులు తెలిపారు.

కొందరు ఇసుక తరలింపుదారులు రాత్రివేళల్లో ఇసుకను తరలించేందుకు ట్రాక్టర్లను మొక్కలు నాటిన ప్రాంతంలోకి తీసుకెళ్లడంతో పెద్ద సంఖ్యలో మొక్కలు ట్రాక్టర్ల కింద పడి ధ్వంసమైనట్లు గ్రామస్తులు ఆరోపించారు. ప్రభుత్వ నిధులతో, పర్యావరణ పరిరక్షణ కోసం నాటిన మొక్కలను ఇసుక రవాణా కోసం తొక్కించడం పట్ల గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా బేగం సమక్షంలో జరిగిన గ్రామసభ రసా బసగా మారింది. ఇసుక అక్రమ రవాణా దారుల నిర్వాకం ఇంత జరుగుతున్న కూడా ఏమీ తెలియనట్లు ఉంటున్నారని ఎంపీడీవో పై గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.



**ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా బేగం వివరణ:**
సోమవారం జరిగిన కొంగోడు గ్రామసభలో ప్రజలు ఎర్రకుంట కింది భాగంలో కొందరు ఇసుక తరలింపుదారులు రాత్రి వేళల్లో ఇసుకను తరలించేందుకు ట్రాక్టర్లను మొక్కలు నాటిన ప్రాంతంలోకి తీసుకెళ్లడంతో పెద్ద సంఖ్యలో మొక్కలు ట్రాక్టర్ల కింద పడి ధ్వంసమైనట్లు సోమవారం జరిగిన గ్రామసభలో గ్రామస్తులు తన దృష్టికి తీసుకువచ్చినట్లు ఎంపీడీవో రఫీక్ ఉందిసా బేగం తెలిపారు. కొంగోడు గ్రామం ఎర్రకుంట కింది భాగంలో ఇసుకాసూరుల స్వైర విహారం!

# ప్రజావాణితో ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం

- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 31(జనంసాక్షి): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, చట్టపరమైన పరిష్కారం అందించడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఫిర్యాదుదారుల నుంచి ఎస్పీ స్వయంగా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ వారి సమస్యలను ఓపికగా విని వివరాలు తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు, సమస్యల పరిష్కారంలో జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో తమ సమస్యకు పరిష్కారం లభించని పక్షంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని ఎస్పీ స్పష్టం చేశారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను తెలియజేయాలని ప్రజలకు సూచించారు.

# రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 31(జనంసాక్షి): హైదరాబాద్‌లో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ సెలక్షన్స్ 2026-27లో పాల్గొనేందుకు సంగారెడ్డి జిల్లా జట్ల ఎంపికలను సెప్టెంబర్ 3న నిర్వహించనున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడల అధికారి (ఎఫ్ ఎ సి) టి.అఖిలేష్ రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా యువజన మరియు క్రీడల కార్యాలయంలో ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అథ్లెటిక్స్ (పురుషులు, మహిళలు), క్రికెట్ (పురుషులు), చెస్, క్యారమ్, హాకీ, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్, ఖో-ఖో, యోగా, బాస్కెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, లాన్ టెన్నిస్, కబడ్డీ తదితర క్రీడల్లో జిల్లా జట్లను ఎంపిక చేయనున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న పర్మినెంట్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే ఈ ఎంపికల్లో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న ఉద్యోగులు సెప్టెంబర్ 3న సర్వీస్ సర్టిఫికెట్ లేదా ఐడీ కార్డుతో జిల్లా యువజన మరియు క్రీడల కార్యాలయానికి హాజరుకావాలని సూచించారు. రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీల్లో సంగారెడ్డి జిల్లా తరఫున ప్రతిభ కనబరిచే క్రీడాకారులను ఎంపిక చేయనున్నందున అర్హులైన ప్రభుత్వ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి కోరారు.

# కొంగోడు గ్రామంలో వి.బి.జి. రామ్‌జీ పనులపై గ్రామసభ

- జలసిరి పనుల గుర్తింపునకు ప్రజలకు అవగాహన
- ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీవో
- గ్రామ సర్పంచ్ దుబ్బగళ్ల స్వామి ఆధ్వర్యంలో



కొల్చారం, ఆగస్టు 31 (జనంసాక్షి): కొల్చారం మండలంలోని కొంగోడు గ్రామపంచాయతీలో సర్పంచ్ దుబ్బగల స్వామి ఆధ్వర్యంలో వి.బి.జి. రామ్‌జీ పనులకు సంబంధించి సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభకు ఎంపీడీవో రఫీకున్నీసా బేగం హాజరై పలు అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. జలసిరి కార్యక్రమం కింద ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్ల నిర్మాణం వంటి పనులను చేపట్టనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరానికి గ్రామానికి అవసరమైన పనులను ప్రజల సూచనల మేరకు గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సిద్దిరాములు, వార్డు సభ్యులు, ఎంపీఓ పోచయ్య, పంచాయతీ కార్యదర్శి నగేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ, అంగన్‌వాడీ టీచర్ మంజుల, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నంగనూరు రెవెన్యూ సర్వేయర్‌పై ప్రజావాణిలో ఫిర్యాదు



నంగనూరు, ఆగస్టు 31 (జనంసాక్షి): నంగనూరు మండలం రెవెన్యూ సర్వేయర్ తీవ్ర నిర్లక్ష్యంతో భూ సర్వే నిర్వహించి తనకు అన్యాయం చేశారని గట్ల మల్యాల గ్రామానికి చెందిన బాధితుడు పి. నర్సయ్య (తండ్రి: ఇస్తారి) ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదు చేశారు.సర్వే నంబర్ 564లో తనకు సంబంధించిన భూమి ఉండగా, సర్వేయర్ కొలతలు కొలిచే క్రమంలో పక్కనే ఉన్న సర్వే నంబర్ 565లోకి కలిపేసి సర్వే నిర్వహించారని బాధితుడు ఆరోపించారు. ఈ తప్పుడు సర్వే వల్ల తన సొంత భూమిపై హక్కులు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా సర్వే రిపోర్ట్ ఇవ్వాలని కోరుతున్నప్పటికీ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఈ విషయమై సిద్దిపేట సబ్‌డివిజన్‌కు అవసరమైన ఫీజు చెల్లించి, సర్వే నంబర్ 564ను విడిచే రీ-సర్వే చేయించాలని కోరారు. తప్పుడు సర్వే చేసినట్లు తేలితే సదరు మండల సర్వేయర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ న్యాయం జరగని పక్షంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో గేదె మృతి



చిలప్‌చెడ్, ఆగస్టు 31 (జనంసాక్షి): చిలప్‌చెడ్ మండల కేంద్రానికి చెందిన గొల్ల మనయ్యకు చెందిన గేదె సోమవారం ఉదయం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. మేతకుల శివారులోని పొలాల్లో మేత మేస్తూ వెళ్లిన గేదె.. సాయిరామ్ అనే రైతు పొలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో అక్కడికక్కడే మృత్యువాత పడింది. సుమారు రూ.60 వేల విలువైన గేదె మృతి చెందడంతో మనయ్య బోరున విలపించారు. తన కుటుంబానికి జీవనాధారంగా ఉన్న గేదెను కోల్పోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తనకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు. సమాచారం అందుకున్న ఆర్ఐ శ్రీహరి, పశువైద్య సిబ్బంది శంకర్ సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. నిబంధనల ప్రకారం బాధితుడికి ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు.

## బాధితుడిని రాజిరెడ్డి పరామర్శ



శివ్వంపేట, ఆగస్ట్ 31 (జనంసాక్షి): కానిస్టేబుల్ శంకర్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నర్సాపూర్ నుండి మెదక్ వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి శంకర్ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ రోడ్డు ప్రమాదంలో కౌడిపల్లి పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న శంకర్ కు తీవ్ర గాయాలయ్యాయి. పార్టీ వర్గాల ద్వారా ఈ విషయం తెలుసుకున్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం మండల కేంద్రమైన శివ్వంపేట లోని బాధితుడు మంగోలి శంకర్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సమయంలో ఆయన వెంట పిఏసిఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, సీనియర్ నాయకులు నవీన్ గుప్తా, మాధవ రెడ్డి, మురళి గౌడ్, వారాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# పంటల సాగు ఇకనుండి వాలంటీర్ల ద్వారానే సర్వే

- అంతర్జాలంలో నమోదై ఉంటేనే కొనుగోలుకు అవకాశం
- మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మ



న్యాల్‌కల్, ఆగస్టు 31(జనంసాక్షి): కేంద్రం తాజాగా పంటలసాగు వివరాలను ఏఈఓలకు బదులుగా ఇకనుండి డీసీఎస్ (డిజిటల్ క్రాప్ సర్వే) ద్వారానే వాలంటీర్లతో పంటల సాగు నమోదు సర్వే చేపట్టనున్నట్లు మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారుల ఆదేశం మేరకు 2026/27 ఖరీఫ్, రబీసీజన్ కు గాను మండలంలో సాగుచేసిన పంటలను వాలంటీర్లు నేరుగా క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి, అంతర్జాలం (ఆన్ లైన్)లో నమోదు చేయనున్నట్లు, సాగుచేసిన పంటలకు మాత్రమే కొనుగోలు చేయనున్నట్లు ఏఓ తెలిపారు. పత్తి, చెరకు, పప్పు ధాన్యాలు, కూరగాయలు, ఉద్యానవన పంటలు, పూలతోటలు, ఆయిల్ ఫామ్, తదితర పంటలను సర్వే చేస్తూ.. ఫోటోలు తీసి ఆన్ లైన్ లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఇకనుండి సర్వే చేపట్టిన వివరాల ఆధారంగానే ప్రభుత్వం పంటలను కొనుగోలు చేయనున్నారని, అందుకు రైతులు సహకరించి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సాగుచేసిన పంటలకు బదులుగా ఇతర పంటలు సాగు చేసినట్లు సమాచారం ఇస్తే నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని సూచించారు. పంటల వివరాలు అంతర్జాలంలో నమోదు చేసి ఉంటేనే కొనుగోలుకు వీలవుతుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఇతరత్రా పథకాలను లబ్ది పొందే ఆస్కారం ఉందని తెలిపారు. అతి త్వరలో చేపట్టనున్న సర్వేకు సాగుచేస్తున్న రైతులు సహకరించి, సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కోరారు.

# వెల్దుర్తి-పిల్లికొట్టాల డబుల్ రోడ్డు కోసం బీఆర్‌ఎస్ పాదయాత్ర

- మంజూరైన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది
- సునీతాలక్ష్మారెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కదిలిన బీఆర్‌ఎస్ శ్రేణులు.. డీఆర్వోకు వినతిపత్రం



మెదక్, ఆగస్టు 31 (జనంసాక్షి): వెల్దుర్తి-పిల్లికొట్టల మధ్య డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రజల రవాణా కష్టాలు తీర్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం భారీ పాదయాత్ర నిర్వహించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శివంపేట మండలం పోతులగూడెం నుంచి కలాన్ శెట్టిపల్లి వరకు పాదయాత్ర చేపట్టారు. అనంతరం కార్ల ర్యాలీగా మెదక్ జిల్లా కలెక్టరేట్‌కు చేరుకున్నారు.

ఈ సందర్భంగా సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. వెల్దుర్తి-పిల్లి కొట్టాల రహదారి అధ్వానంగా మారడంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం, వ్యాపార అవసరాల కోసం పరిసర గ్రామాల ప్రజలు ఈ రహదారిపైనే ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. వర్షాకాలంలో సమస్య మరింత తీవ్రమవుతోందని, ప్రభుత్వం వెంటనే డబుల్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రభుత్వం మారిన తర్వాత పనులు నిలిచిపోయాయని, గతంలో మంజూరైన నిధులను రద్దు చేశారని ఆరోపించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను రాజకీయాలకు అతీతంగా కొనసాగించాలని కోరారు.

జిల్లా కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్‌ను కలిసి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. గతంలో మంజూరైన నిధులను పునరుద్ధరించి డబుల్ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. రహదారి నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రజల తరఫున ఉద్యమం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో దేవేందర్‌రెడ్డి, మల్లికార్జున గౌడ్, కౌన్సిలర్లు మామిళ్ల ఆంజనేయులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఫీజు రీయింబర్స్‌మెంట్

# బకాయిలు చెల్లించాలి

**పెద్ద శంకరంపేట, ఆగస్టు 31 (జనంసాక్షి):** విద్యార్థులకు ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని సోమవారం పెద్ద శంకరంపేట తాసిల్దార్ కార్యాలయంలో ఏబీవీపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దినేష్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు బకాయిలు ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్ డబ్బులను చెల్లించాలన్నారు. విద్యార్థులు ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు గణేష్ శ్రీధర్ అజయ్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్లు సంగీత, పాండు
- కలెక్టరేట్ ప్రజావాణికి 41 ఫిర్యాదులు

**సంగారెడ్డి, ఆగస్టు 31 (జనంసాక్షి):** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి ఫిర్యాదు, వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతో పాటు సంబంధిత దరఖాస్తుదారులకు స్పష్టమైన సమాధానం అందించాలని అదనపు కలెక్టర్లు సంగీత, పాండు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. దరఖాస్తులపై తీసుకున్న చర్యలను నమోదు చేసి, నిర్ణీత గడువు



లోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. మండల స్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్లు సూచించారు. తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రజలు సంబంధిత మండల స్థాయి ప్రజావాణిలో ఫిర్యాదులు, వినతులు సమర్పించవచ్చని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్లు సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 71 ఫిర్యాదులు, వినతులు అందాయని, వీటిలో కలెక్టరేట్‌లో 41, సంగారెడ్డి డివిజన్‌లో 22, జహీరాబాద్ డివిజన్ 05, నారాయణఖేడ్ డివిజన్ 03 ఫిర్యాదులు, వినతులు అందగా, ఆందోల్ డివిజన్‌లో ఎలాంటి ఫిర్యాదులు, వినతులు అందలేదని తెలిపారు. ప్రజావాణిలో ప్రధానంగా రెవెన్యూ, హౌసింగ్, పెన్షన్లు, పంచాయతీరాజ్, కాలుష్య నియంత్రణ మండలి, పోలీస్, ఆర్టీసీ, నిమ్జ్, ఎంప్లాయ్‌మెంట్, ఎస్సీ, బీసీ అభివృద్ధి, సహకార, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, వ్యవసాయం, డీఆర్డీఏ, గ్రౌండ్ వాటర్, నీటిపారుదల, ఆర్‌సీఓ, కార్మిక, జిల్లా పరిషత్, మున్సిపల్, విద్య తదితర శాఖలకు సంబంధించిన సమస్యలపై ఫిర్యాదులు, వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదుకు స్పందన - బెజ్జంకి జాతర ప్రవేశ రుసుము టెండర్ రద్దు

- సామాజిక కార్యకర్త డాక్టర్ వేల్పుల శంకర్

**బెజ్జంకి, ఆగస్టు 31 (జనంసాక్షి):** బెజ్జంకి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం జిల్లా సిద్దిపేటలో జరిగే ప్రతి సంవత్సరం జరిగే గత సంవత్సరం జాతరలో ప్రతి భక్తుడి నుంచి రూపాయలు 20 ప్రవేశ రుసుము వసూలు చేయడాన్ని రద్దు చేయాలని దేవదాయ శాఖ అధికారులకు ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేయడం జరిగిందని శంకర్ తెలిపారు. ఈ జాతరలో ప్రతి వ్యక్తి నుండి 20 రూపాయల టికెట్ తీసుకోవడం వలన భక్తులు చాలా ఇబ్బందులు పడడం జరిగింది. దేవాలయంలో దేవుడి దర్శనానికి ప్రత్యేక దర్శనం ఉండాలి కానీ ఇక్కడ ఉచిత దర్శనానికి ప్రతి ఒక్కరికి 20 రూపాయల రుసుము దీనిని దృష్టిలో పెట్టకొని ఇతరులు విమర్శించే పరిస్థితి ఉన్నందున దీనిని రద్దు చేయాలని తేదీ 06 - 04- 2026 రోజున ప్రజావాణి దేవదాయ శాఖలో ఫిర్యాదు చేయడం జరిగిందని శంకర్ తెలిపారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన దేవాదాయ శాఖ అధికారులు, రాబోయే జాతరలో భక్తుల నుంచి వసూలు చేయాల్సిన రూపాయల 20 ప్రవేశ రుసుము టెండర్‌ను రద్దు చేయడం జరిగిందని తెలిసింది. భక్తుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని స్పందించిన దేవదాయ శాఖ అధికారులకు ప్రజల తరఫున వేల్పుల శంకర్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి వేదికగా నిరంతరం పోరాటం కొనసాగిస్తామని శంకర్ తెలిపాడు. ప్రజల కోసం పోరాటం చేస్తూనే ఉంటానని శంకర్ అన్నారు.

# ఆడబిడ్డలకు విద్యే ఆయుధం..

- 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం..
- బేటీ బచావో.. బేటీ పడావోపై అవగాహన..



**చిలప్‌చెడ్, ఆగస్టు 31(జనంసాక్షి):** మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చిలప్‌చెడ్ మండల పోషణ కార్యాలయంలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులకు ఆడబిడ్డల సంరక్షణ, విద్య ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. స్కూల్ విద్యార్థులు పోషణ ప్రశాంత్‌కు రాఖీలు కట్టడంతో పాటు మండల స్థాయి అధికారులకు కూడా రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆడబిడ్డలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేయాలని, అంతకుముందు బాల్య వివాహాలు చేయకూడదని సూచించారు. ఆడపిల్లలను ఉన్నత విద్య వైపు ప్రోత్సహించి, వారి భవిష్యత్తుకు తల్లిదండ్రులు అండగా నిలవాలని తెలిపారు. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమం లక్ష్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోషణ ప్రశాంత్, మండలస్థాయి అధికారులు, ICDS సూపర్ వైజర్, అంగన్‌వాడీ టీచర్, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామకంఠం భూములను కబ్జాల నుండి కాపాడాలి

ప్రజావాణిలో ఎమ్మార్వో,ఎంపీడీవోకు వినతి పత్రం అందజేసిన సిపిఎం మండల కమిటీ నాయకులు



**కొండపాక, ఆగస్టు 31(జనంసాక్షి):** కొండపాక మండల పరిధిలోని గ్రామాలలో ఉన్న గ్రామ కంఠంభూములను కబ్జాకు గురవుతున్న భూములనుకాపాడాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని స్థానికంగా మండలంలో ఉన్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి అమ్ముల బాల్ నర్సయ్య డిమాండ్ చేశారు. స్థానికంగా మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బాల నర్సయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య,వైద్యం,ఉపాధి అవకాశాలు ఉద్యోగాలు ఇండ్లు, ఇండ్ల స్థలాలు,ఇందిరమ్మ ఇండ్లను, పెన్షన్లు,మహిళలకు ఇస్తానన్న 2500 రూపాయలు, రేషన్ కార్డులు, తదితర సమస్యలు పరిష్కరిస్తూనే మండలంలోని వివిధ గ్రామాలకు లింకు చేస్తూ ఉన్న రోడ్లు గుంతల మయమై ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉందన్నారు. మట్టి రోడ్లను బీటీ రోడ్లు వేస్తూ బాగు చేయాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గ్రామాలలో ఉన్న చెరువు కట్టల కింద గొలుసు జాగా కబ్జాలకు గురి అవుతున్నాయన్నారు. వెంటనే ఆ స్థలాలను సర్వే చేయించి గొలుసు జాగా వివిధ రైతులకు ఉపయోగపడే విధంగా బాటగా చేయాలని కోరారు. గతంలో చెరువు నీటితో పంటలకు ఉపయోగపడేదని అట్టి గొలుసుకట్టు కాలువలు మొత్తం కబ్జాల గురై కాలువ లేకుండా పోయాయని వెంటనే కాల్వలను ఉపాధి హామీ కూలీలతో కాల్వల పునర్నిర్మాణం చేయాలని తెలియజేశారు. గ్రామాలలో గ్రామకంఠం స్థలాలు ప్రభుత్వ భూములు ఉన్న అట్టి భూములను కబ్జాల గురి అవుతున్నా గాని పట్టించుకునే నాథుడు లేదని అన్నారు. వెంటనే స్థానిక అధికారులు అట్టి భూములలో సూచిక బోర్డులను ఏర్పాటు చేసి గ్రామపంచాయతీ ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని కోరారు. వెలికట్ట,అంకిరెడ్డిపల్లి, బంధారము, దర్గా,దుద్దెడ, విశ్వనాథ్ పల్లి రవీంద్ర నగర్, గ్రామాలకు సాగునీటి కోసం చెరువులు నింపడానికి కాలువలు నిర్మించి చెరువులు నింపి రైతందానికి సాగుకు అందివ్వాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలను రైతాంగాని కలుపుకొని ఉద్యమాలకు దిగవలసి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు నాయకులు మూడోజు కనకాచారి,తాటోజు రవీంద్ర చారి,గజబింకర్ బాలకిషన్, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# 34 ఏళ్ల రెవెన్యూ సేవలకు ఘన వీడ్కోలు

- నాయబ్ తహసీల్దార్ యాసీన్ ఖాన్ పదవీ విరమణ



**కోహీర్, ఆగస్టు 31 (జనంసాక్షి):** రెవెన్యూ శాఖలో 34 సంవత్సరాల సుదీర్ఘ సేవలు అందించిన కోహీర్ నాయబ్ తహసీల్దార్ శ్రీ యాసీన్ ఖాన్ సోమవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా కోహీర్ తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో భారత్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ అభినందన, వీడ్కోలు సభను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా తోటి అధికారులు, కార్యాలయ సిబ్బంది యాసీన్ ఖాన్‌ను దుశ్శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఆయనతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, సేవా కాలంలో అందించిన సహకారాన్ని కొనియాడారు.

కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనేది బాధ్యతల నుంచి విశ్రాంతి మాత్రమేనని, సమాజానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు. అనంతరం యాసీన్ ఖాన్ శేష జీవితం ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో సాగాలని అధికారులు, సిబ్బంది, స్థానికులు ఆకాంక్షించారు.

# పాలిటెక్నిక్ ఉద్యోగుల 15వ రోజు భోజన విరామ నిరసన

**నంగునూరు, ఆగస్టు 31(జనంసాక్షి):** రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు, పాలిటెక్నిక్ కళాశాలలను 'శక్తి' (స్కిల్ యూనివర్సిటీ)లో కలపడాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఉద్యోగులు 15వ రోజు భోజన విరామ నిరసన నిర్వహించారు. ప్రభుత్వం జీవో 97ను రద్దు చేసే వరకు రాష్ట్రవ్యాప్తంగా శాంతియుత నిరసనలు కొనసాగిస్తామని ఉద్యోగులు స్పష్టం చేశారు. పాలిటెక్నిక్‌ని స్కిల్ యూనివర్సిటీలో కలపడం వల్ల నాణ్యమైన ఇంజనీరింగ్ విద్య దూరమవ్వడమే కాకుండా, పేద, మధ్యతరగతి విద్యార్థులపై ఆర్థికభారం పడి ఉన్నత విద్యా అవకాశాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు.

?కమిటీతో చర్చలు: తెలంగాణ పాలిటెక్నిక్ ఐక్య కార్యాచరణ సమితి సహాయ అధ్యక్షుడు బూరం అభినవ్ మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వ హైలెవెల్ కమిటీతో



జరిగిన సమావేశంలో పాలిటెక్నిక్ విద్య అవశ్యకతను, విలీనం వల్ల విద్యార్థుల్లో నెలకొన్న భయాందోళనలను వివరించినట్లు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు పాతూరి శ్రీనివాస రెడ్డి, రామకృష్ణ, రాజమౌళి, విజయ్ కుమార్, కవిత, జ్యోతి, వైదేహి, సంతోష్, నవీన్, కమల్ అహ్మద్, మంజుల, వాణి, భాగ్యలక్ష్మి మరియు ఇతర కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# హెచ్ఎం పోస్టు ఖాళీ.. పర్యవేక్షణ గాలికి!

## బడిబాట కార్యక్రమానికీ దూరం.. నాగల్‌గిద్ద జెడ్పీహెచ్ఎస్‌పై అధికారుల నిర్లక్ష్యమా?

**నాగల్‌గిద్ద, ఆగస్టు 31 (జనంసాక్షి):** నాగల్‌గిద్ద మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్వహణ, పర్యవేక్షణపై విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు రెగ్యులర్ ప్రధానోపాధ్యాయుడిని నియమించకపోవడంతో విద్యార్థుల విద్యాభ్యాసం, పాఠశాల పరిపాలనపై ప్రభావం పడుతోందని వారు ఆరోపిస్తున్నారు.

**స్థానికుల వివరాల ప్రకారం..** ఏడాది క్రితం గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా సిద్ధారెడ్డి పదోన్నతి పొందినప్పటికీ ప్రస్తుతం జిల్లా సైన్స్ అధికారిగా కొనసాగుతున్నారని తెలిపారు. దీంతో నాగల్‌గిద్ద జెడ్పీహెచ్ఎస్‌తో పాటు కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల పర్యవేక్షణ కూడా సక్రమంగా జరగడం లేదని పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు, తల్లిదండ్రులను ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షించేందుకు నిర్వహించే బడిబాట కార్యక్రమానికి కూడా ప్రధానోపాధ్యాయుడు హాజరుకాలేదని స్థానికులు తెలిపారు. ఇలాంటి ముఖ్యమైన కార్యక్రమాల్లో హెచ్ఎం అందుబాటులో లేకపోవడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**పలుమార్లు ఫిర్యాదులు.. అయినా స్పందన లేదంటున్న స్థానికులు...**

పాఠశాలకు రెగ్యులర్ హెచ్ఎంను నియమించాలని కోరుతూ స్థానిక నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో కెవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గణపతి, వార్డు సభ్యులు రమేష్, తుకారాం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పాఠశాలకు రెగ్యులర్ హెచ్ఎంను నియమించి పరిపాలనను గాడిలో పెట్టాలని వారు కోరారు. అధికారుల నిర్లక్ష్యం కొనసాగితే బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రెగ్యులర్ హెచ్ఎంను నియమిస్తే పాఠశాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థుల భవిష్యత్తుకు మెరుగైన అవకాశాలు కల్పించవచ్చని వారు పేర్కొన్నారు. ఎంఈవోకు ఫిర్యాదు పంపిన ఎంపీడీవో ప్రజావాణిలో అందిన ఫిర్యాదును ఎంపీడీవో మహేశ్వరరావు స్వీకరించి, తదుపరి చర్యల కోసం ఎంఈవో మన్మధ కిషోర్‌కు పంపించినట్లు తెలిపారు. నేటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు రెగ్యులర్ హెచ్ఎంను నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల పర్యవేక్షణ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుని, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



## మాధవానంద సరస్వతి స్వామిని దర్శించుకున్న రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్



**కొల్చారం, ఆగస్టు 31 (జనంసాక్షి):** రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాలవ సుజాత సోమవారం కొల్చారం మండలంలోని రంగంపేట గ్రామంలో కొలువుదీరిన శ్రీశ్రీశ్రీ మాధవా నంద సరస్వతి స్వాములవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీస్సులు పొందుకున్నారు. అనంతరం ఆలయ విశేషాలను, ఆధ్యాత్మిక కార్యక్రమాల వివరాలను తెలుసుకున్నారు.

## కాంగ్రెస్ పాలనలోనే నిజమైన అభివృద్ధి

• **ఆవుల రాజిరెడ్డి**



**శివ్వంపేట, ఆగస్ట్ 31 (జనంసాక్షి):** కాంగ్రెస్ పాలనలోనే గ్రామాల్లో నిజమైన అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజీరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన శివంపేట గ్రామానికి చెందిన మియ్యాడి నర్సింలుకు ప్రభుత్వం ద్వారా ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా, ఇటీవల ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేసి గృహప్రవేశానికి సిద్ధం చేశారు. సోమవారం ఈ ఇందిరమ్మ ఇల్లు ను రాజిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సింలు దంపతులు ఆవుల రాజు రెడ్డి గారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా, సీనియర్ నాయకులు మాధవరెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు బుర్రా మురళి, ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలుగు ఉపాధ్యాయుడు సస్పెన్షన్




**మెదక్,పాపన్నపేట,ఆగస్టు 31 (జనంసాక్షి):** విద్యార్థినుల ఆరోపణలకు పాలన యంత్రాగం కదిలింది. దీంతో మెదక్ జిల్లా పాపన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు నర్సింలు పై విద్య శాఖ సోమవారం సస్పెన్షన్ వేటు వేసింది. ప్రభుత్వ బడిలో విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడి తీరు సరిలేదని ఆరోపణలు ఇటీవల పాఠశాలలో నిర్వ హించిన అవగాహన కార్యక్రమం ద్వారా వెలుగులోకి వచ్చింది.

విద్యార్థినుల నుంచి హెల్ప్ లైన్ కు వచ్చిన ఫిర్యాదును సంబంధిత అధికారులు తీవ్రంగా పరిగణించారు. ఈ ఘటన పై జిల్లాపాలన, బాలికల, మహిళా సంక్షేమ, విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆరాతీశారు. బాలికల భద్రతకు సంబంధించిన అంశం కావడంతో అధికారులు విచారణలో భాగంగా ప్రాథమికంగా క్షేత్రస్థాయిలో దశల వారీగా చర్చించి, వివరాలు సేకరించి ఉపాధ్యాయుడిపై ఈ వేటు వేశారు.

## సత్యంను పరామర్శించిన వంగ రాజేశ్వర్ రెడ్డి



**నంగునూరు, ఆగస్టు 31(జనంసాక్షి):** సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం అప్పలాయచెరువు గ్రామ సర్పంచ్ పెద్దమ్మల సత్యం ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికావడంతో, ఆ విషయం తెలుసుకున్న నాయకులు వంగ రాజేశ్వర్ రెడ్డి సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సత్యంను ఆయన నేరుగా వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్లతో మాట్లాడి సత్యం ఆరోగ్య పరిస్థితి, అందిస్తున్న వైద్య సేవలను రాజేశ్వర్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలవడమే తన బాధ్యత అని పేర్కొన్న వంగ రాజేశ్వర్ రెడ్డి, సర్పంచ్ సత్యం త్వరగా కోలుకుని పరిపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు ఎవరూ అధైర్యపడవద్దని, వైద్య చికిత్సతో పాటు ఇతర ఏ అవసరం వచ్చినా సహాయ సహకారాలు అందించేందుకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు.

## ఘనంగా ఉజ్జయిని మహంకాళి ఉత్సవాలు



**వెల్దుర్తి, ఆగస్టు 30 (జనంసాక్షి):** మాసాయిపేట మండల కేంద్రంలో ఉజ్జయిని మహంకాళి జాతర ఉత్సవాలు గత రెండు రోజులుగా భక్తిశ్రద్ధతో జరుగుతున్నాయి గ్రామ సమీపంలో కొలువైన అమ్మవార్లకు ఆదివారం రాత్రి బోనాల ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు డప్పు చప్పుల్లో పోతరాజు విన్యాసాల మధ్య ఈ ఉత్సవాలు జరిగాయి సోమవారం దేవత మూర్తులకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి గ్రామస్తులు మహిళలు ఓడిబియ్యం కానుకలు సమర్పించి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. సాయంత్రం వేళ శివసత్తుల పూనకా లతోగౌవురంగం నిర్వహించారు శివసత్తులు రంగంలో తమ భవిష్యవాన్ని వినిపించారు మంగళవారం గ్రామ దేవతలకు బోనాల ఊరేగింపు ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఉంటాయని ఉత్సవ నిర్వాహకులు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి ఉప సర్పంచ్ వెంకటేష్ మాజీ సర్పంచ్లు మధుసూదన్ రెడ్డి నాగరాజు మాజీ ఎంపీటీసీ సిద్ధి రాములు గౌడ్ సభ్యులు పాటు గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు గ్రామస్తులు సత్తయ్య నర్సింలు శ్రీనివాసు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణపై బీఎల్ఓలకు అవగాహన



**కోహీర్, ఆగస్టు 31 (జనంసాక్షి):** కోహీర్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ సి. శశిధర్ ఆధ్వర్యంలో బూత్ లెవల్ అధికారులతో (బీఎల్ఓ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఎల్ఓ సూపర్వైజర్ ధనరాజ్ పాల్గొన్నారు. భారత ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్-సర్) కార్యక్రమంపై బీఎల్ఓలకు సమావేశంలో సమగ్ర అవగాహన కల్పించారు. తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అదేవిధంగా నకిలీ, మరణించిన, వలస వెళ్లిన ఓటర్ల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని తెలిపారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న, సాధారణ నివాసం ఉన్న ప్రతి భారత పౌరుడు ఓటరుగా నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వృద్ధులు, దివ్యాంగులు, బలహీన వర్గాలకు చెందిన అర్హులైన ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని ఆదేశించారు.

ప్రజలకు అవసరమైన పత్రాలు, ఓటరు నమోదు, వివరాల సవరణ తదితర అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పిస్తూ నిర్ణీత గడువులో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని బీఎల్ఓలకు సూచించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సి. శశిధర్ మాట్లాడుతూ, ప్రజలందరూ బీఎల్ఓలకు సహకరించి తమ ఓటరు వివరాలను ఒకసారి సరిచూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఓటరు జాబితాలో తప్పులు ఉంటే నిబంధనల ప్రకారం సవరణలు చేసుకునేందుకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

## మెదక్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం.. అభివృద్ధి, ప్రజా సమస్యలపై కీలక చర్చ





**మెదక్, ఆగస్టు 31 (జనంసాక్షి):** మెదక్ పట్టణంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమం, మున్సిపల్ పరిపాలనకు సంబంధించిన పలు కీలక అంశాలపై మెదక్ పురపాలక సంఘ సాధారణ సర్వసభ్య సమావేశంలో విస్తృతంగా చర్చించారు.అనంతరం మొత్తం 66 అంశాలను గౌరవ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర ప్రజా అవసరాలకు సంబంధించిన అంశాలపై సభ్యులు చర్చించారు. పట్టణ అభివృద్ధికి అవసరమైన చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రత్యేకంగా విద్యుత్ శాఖ, మిషన్ భగీరథ, నేషనల్ హైవే, వైద్య-ఆరోగ్య శాఖ తదితర విభాగాల అధికారులు సమావేశంలో పాల్గొని ఆయా శాఖలకు సంబంధించిన అంశాలపై సభ్యులకు వివరాలు అందించారు.

పట్టణ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సభ్యులు సూచించారు. ఈ సమావేశానికి గౌరవ మెదక్ మున్సిపల్ మున్సిపల్ చైర్మన్ కానుగ రాధిక భూపతి రాజు , వివిధ పట్టణం కౌన్సిలర్లు, గౌరవ కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్, నవీన్ వివిధ విభాగాల అధికారులు, మున్సిపల్ సిబ్బందితో పాటు లైన్ డిపార్ట్‌మెంట్లకు చెందిన అధికారులు హాజరయ్యారు.

# ట్రేడ్ లైసెన్స్ పేరుతో మోసాలకు పాల్పడితే చర్యలు

- వాణిజ్యదారులు అప్రమత్తంగా ఉండాలి: మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి



**సంగారెడ్డి, ఆగస్టు 31 (జనంసాక్షి):** సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని వాణిజ్యదారులు ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యువల్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి. సోమవారం సూచించారు. ట్రేడ్ లైసెన్స్‌లు రెన్యువల్ చేస్తామంటూ కొంతమంది వ్యక్తులు వాణిజ్యదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు మున్సిపల్ అధికారుల దృష్టికి వచ్చినట్లు తెలిపారు. అంతేకాకుండా, కొంతమంది వ్యక్తులు మున్సిపల్ సర్టిఫికెట్లను ఎడిట్ చేసి, నకిలీ ధ్రువపత్రాలను అక్రమంగా అందిస్తున్నట్లు గుర్తించినట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తులను నమ్మి ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు చెల్లించవద్దని వాణిజ్యదారులకు సూచించారు. మున్సిపల్ సేవలకు సంబంధించిన రుసుములను మీ సేవా కేంద్రాల ద్వారా, అధికారిక ఆన్‌లైన్ విధానంలో లేదా సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో మాత్రమే చెల్లించాలని స్పష్టం చేశారు. అనధికార వ్యక్తులకు, వారి వ్యక్తిగత స్కానర్‌లు లేదా బ్యాంకు ఖాతాలకు ఎలాంటి రుసుములు చెల్లించరాదని హెచ్చరించారు. మున్సిపల్ పేరుతో మోసపూరితంగా సర్టిఫికెట్లు తయారు చేసి అందిస్తున్న వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలు, వాణిజ్యదారులు అప్రమత్తంగా ఉండి ఇలాంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సూచించారు.

# రసాయన ఎరువులతో సరైన పోషకాలు అందడం లేదు: ఏడిఏ సంధ్యారాణి



**శివ్వంపేట, ఆగస్టు 31 (జనంసాక్షి):** ప్రస్తుతం వరి పంటకు యూరియా, డీఏపీ, పోటాష్ అలాగే జింక్ ఎరువులను ఉపయోగిస్తున్నప్పటికీ, వాటిలోని పోషకాలు పూర్తిగా మొక్కలకు అందడం లేదని నర్సాపూర్ ఏడీఏ సంధ్యారాణి అన్నారు. శివంపేట గ్రామంలో ఆత్మ వారి సౌజన్యంతో రైతు క్షేత్ర పర్యటన లో భాగంగా సోమవారం బొడ్డు నర్సింలు పొలాన్ని వ్యవసాయ, ఆత్మ అధికారులు సందర్శించి పంటకు నేలలో జరిగే రసాయనిక చర్యల వల్ల కొంత నత్రజని నష్టపోవడం, ఫాస్పరస్ బంధించబడటం, పొటాషియం, అలాగే జింక్ లభ్యత తగ్గడం జరుగుతుందని తెలిపారు. దీంతో పంట ఎదుగుదల అదే మాదిరిగా పంట దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. ఈ సమస్యకు సమర్థవంతమైన, పర్యావరణహిత పరిష్కారమే ఎన్పీకే కన్సర్షియమ్ బయోఫర్టిలైజర్ అనేది నత్రజని స్థిరీకరణ, ఫాస్పరస్ కరిగించడం, పొటాషియం అదేవిధంగా జింక్‌ను మొక్కలకు అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయోజనకరమైన సూక్ష్మజీవుల సమ్మేళనం. ఇది పోషకాల వినియోగ సామర్థ్యాన్ని పెంచి, వేర్ల అభివృద్ధిని మెరుగుపరచి, మొక్కలు ఆరోగ్యంగా ఎదిగేలా చేస్తుందని వివరించారు. ఫలితంగా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తూ, నేల సారవంతతను పెంపొందించి, అధిక దిగుబడి మరియు మెరుగైన పంట నాణ్యతను సాధించవచ్చునని కేవీకే తునికి రవి చెప్పారు. ఫెరమోన్ ట్రాప్స్ పైన అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏవో లావణ్య ఏఈవో రవి, సౌజన్య, హరిత, రైతులు పాల్గొన్నారు.

# రసమయి బాలకిషన్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన యూత్ కాంగ్రెస్

- యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కర్రావుల సందీప్



**బెజ్జంకి,ఆగస్టు 31,(జనంసాక్షి):** యూత్ కాంగ్రెస్ నాయకులను డ్రగ్గిస్టులు అంటూ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు యూత్ కాంగ్రెస్ బెజ్జంకి మండల అధ్యక్షుడు కర్రావుల సందీప్ అన్నారు. యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, డ్రగ్స్ నిర్మూలన కోసం పోరాడుతున్న యూత్ కాంగ్రెస్ నాయకులను అవమానించేలా మాట్లాడటం సరికాదు అని అన్నారు. రాజకీయ విమర్శలు చేయడంలో తప్పులేదని, అయితే నిరాధార ఆరోపణలతో యువజన నాయకుల ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. రసమయి బాలకిషన్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని యూత్ కాంగ్రెస్ నాయకులకు బహిరంగంగా వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని, యువత భవిష్యత్తు కోసం పనిచేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులను అవమానించే వ్యాఖ్యలను సహించేది లేదని సందీప్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు అసెంబ్లీ ప్రెసిడెంట్ అట్ల అనిల్ కుమార్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శానగొండ శరత్ కుమార్, తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు కర్ర మణికంఠ, శ్రీకాంత్, మహేందర్, రవి, రాగటి అంజి, చుక్క హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# 20 ఏళ్లుగా కాస్తులో ఉన్న రైతులకు పట్టా పాస్‌బుక్కులు ఇవ్వాలి

- 209 సర్వే నంబర్ రైతులకు న్యాయం చేయాలి
- సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



**కొల్చారం, ఆగస్టు 31(జనంసాక్షి):** కొల్చారం మండలం కొంగోడు గ్రామంలోని 209 సర్వే నంబర్ భూముల్లో గత 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న రైతులకు వెంటనే పట్టా పాస్‌బుక్కులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కాస్తులో ఉన్న రైతులకు భూమిపై హక్కులు కల్పించి, పట్టా పాస్‌బుక్కులు అందించాలని నినదించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కె.నర్సమ్మ మాట్లాడుతూ.. కొంగోడు గ్రామానికి చెందిన సుమారు 86 కుటుంబాలు 2006 సంవత్సరం నుంచి 209 సర్వే నంబర్‌లోని భూములను సాగు చేసుకుంటూ కాస్తులో ఉన్నప్పటికీ, ఇప్పటివరకు ప్రభుత్వం వారికి భూమికి సంబంధించిన పట్టా పాస్‌బుక్కులు ఇవ్వలేదని అన్నారు. పట్టా పాస్‌బుక్కులు లేకపోవడంతో రైతులు ప్రభుత్వం అందించే పలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా రైతుబంధు వంటి వ్యవసాయ ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. తమ భూములకు పట్టా పాస్‌బుక్కులు మంజూరు చేయాలని రైతులు గతంలో అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని నర్సమ్మ అన్నారు. రెండు దశాబ్దాలుగా భూములను సాగు చేసుకుంటున్న రైతుల సమస్యను ప్రభుత్వం ఇంకా పరిష్కరించకపోవడం పట్ల ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యపై ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి 209 సర్వే నంబర్‌లో కాస్తులో ఉన్న అర్హులైన రైతుల భూములను పరిశీలించి పట్టా పాస్‌బుక్కులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు వారి తరఫున పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాస్తుదారులు దాసు, విజయ, జయమ్మ, పోచయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణలో మాలలకు అన్యాయం

- రోస్టర్‌లో 22వ స్థానంతో ఉద్యోగ అవకాశాలు తగ్గుతాయి
- డిమాండ్ నెరవేర్చకుంటే సెప్టెంబర్ 7న మెదక్ కలెక్టరేట్ ముట్టడి



**కొల్చారం, ఆగస్టు 31(జనంసాక్షి):** ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఎస్సీ వర్గీకరణలో మాలలకు అన్యాయం జరిగిందని మాల జేఏసీ కో చైర్మన్ కల్లూరి సంజీవ ఆవేదన వ్యక్తం చేశారు. 59 ఎస్సీ కులాలను ఏ,బీ,సీ మూడు వర్గాలుగా విభజించి, సీ వర్గంలో 29 కులాలతో పాటు మాలలను చేర్చడం వల్ల తమకు తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. సీ వర్గంలో రోస్టర్ విధానంలో మాలలకు 22వ స్థానం కేటాయించారని, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ఒక్కో కేటగిరీలో 22 ఖాళీలు భర్తీ అయ్యే పరిస్థితి ఉండదని, దీంతో మాలలకు ఉద్యోగ అవకాశాలు మరింత తగ్గిపోతాయని జేఏసీ కన్వీనర్ ఆకుల పెంటయ్య ఆందోళన వ్యక్తం చేశారు. రోస్టర్‌లో తమకు కేటాయించిన 22వ స్థానాన్ని 11వ స్థానానికి మార్చాలని వారు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని, సెప్టెంబర్ 7న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని మాల సమైక్య సమితి నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బేగరి సంజీవులు, రత్నం, నీరుడిదుర్గేష్, రవి, శివ తదితరులు పాల్గొన్నారు.

# తల్లి కిడ్నీ దానం చేసినా దక్కని ప్రాణం..యువకుడి మృతి



**కల్హేర్, ఆగస్టు 31(జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. కల్హేర్ మండలం రాపర్తి గ్రామానికి చెందిన ఈర్ల సాయిలు అనే యువకుడు కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. సాయిలు కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో తీవ్రంగా బాధపడుతున్నారు. కుమారుడి ప్రాణాలను కాపాడుకోవాలనే తపనతో ఆయన తల్లి తన కిడ్నీని దానం చేశారు. తల్లి చేసిన అవయవ దానంతో కిడ్నీ మార్పిడి అనంతరం సాయిలు కొంతకాలం ఆరోగ్యంగా ఉన్నారు. అయితే విధి మరోలా నిర్ణయించినట్లు తిరిగి ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించింది. ఆరోగ్యం మరింత క్షీణించడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వైద్యుల ప్రయత్నాలు ఫలించకపోవడంతో చికిత్స పొందుతూనే సాయిలు సోమవారం తుదిశ్వాస విడిచారు. కుమారుడి ప్రాణం కోసం తల్లి తన కిడ్నీని దానం చేసినప్పటికీ చివరకు అతడిని కాపాడుకోలేకపోవడం స్థానికులను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. యువకుడి అకాల మరణంతో రాపర్తి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల రోదనలు పలువురిని కలచివేశాయి.

# తహసీల్దార్ కిష్టయ్యకు ఘన సన్మానం

- ఉద్యోగ విరమణ సందర్భంగా అధికారుల వీడ్కోలు



**చౌటకూరు,ఆగస్టు 31(జనంసాక్షి):** మండల తహసీల్దార్ నామాల కిష్టయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఆగస్టు 31న సుదీర్ఘ ఉద్యోగ ప్రస్థానాన్ని ముగించి ఆయన పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ పాండు, జోగిపేట ఆర్డీవో రమేశ్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగిగా కిష్టయ్య ప్రజలకు అందించిన సేవలు అభినందనీయమన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. రెవెన్యూ శాఖలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని తెలిపారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. ఆర్డీవో రమేశ్‌బాబు మాట్లాడుతూ తహసీల్దార్‌గా కిష్టయ్య అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారని తెలిపారు. ఆయన సేవలను అధికారులు, సిబ్బంది చిరకాలం గుర్తుంచుకుంటారని అన్నారు. అనంతరం అధికారులు, రెవెన్యూ సిబ్బంది, వివిధ శాఖల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు కిష్టయ్యను శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. జ్ఞాపికలను బహూకరించి ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

• డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్



**మెదక్ బ్యూరో, ఆగస్టు 31 (జనంసాక్షి):** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 48 దరఖాస్తులను స్వీకరించారు. అందులో భూభారతి 16, ఇందిరమ్మ ఇండ్లు 6,పెన్షన్ 1, ఇతర 25 మొత్తం 48 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా పరిష్కరించి పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రజల సమస్యల పట్ల అధికారులు స్పందిస్తూ, వినతులను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓపిడి శ్రీనివాసరావు,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గంట గుళికలు తీసుకుంటేనే యూరియా ఇస్తాం





**తూప్రాన్, ఆగస్టు 31(జనంసాక్షి):** గంట గుళికలు తీసుకుంటేనే యూరియా ఇస్తాం లేకుంటే సర్వర్ డౌన్ ఉందంటూ తూప్రాన్‌లో ఆంజనేయ ఫర్టిలైజర్ యజమాని రైతులను తిప్పి పంపిన సంఘటన తెలిసింది మనోహరాబాద్ మండలం గౌతోజిగూడ గ్రామానికి చెందిన రైతు వెంకటేశం తూప్రాన్‌లోని ఆంజనేయ ఫెర్టిలైజర్ దుకాణం కు ఆరు బస్తాల యూరియాను ఆన్లైన్‌లో బుక్ చేశాడు. సోమవారం సాయంత్రం యూరియా తీసుకెళ్లడానికి షాప్ వద్దకు వెళ్లగా గంట గుళికలు తీసుకుంటేనే యూరియా ఇస్తా గంట గుళిక బస్తా 900 రూపాయలు ఎక్కువ ఇవ్వాలంటూ రైతుకు చెప్పడంతో నాకు గుళికల మందు వద్దు అంటూ యూరేని కావాలని అడిగాడు దీంతో ఆగ్రహం వ్యక్తం చేశారు యజమాని వెంకట్ రెడ్డి ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో గులకల మందు తీసుకుంటేనే యూరియా ఇస్తా లేకుంటే లేదు అంటూ రాత్రి 8 గంటల వరకు రైతు ను సతాయించాడు సర్వర్ పని చేయడం లేదంటూ కుంటి సాకులు చెప్పాడు ఈ విషయం మండల యేసయ్య అధికారి గంగుమలు దృష్టికి తీసుకెళ్లగా అతను బుక్ ఇస్తానని ఇష్టముంటే తీసుకుంటాడు లేకుంటే లేదు అని మంగళవారం రమ్మని తిప్పి పంపాడు ఈ విషయంపై ఫర్టిలైజర్ షాప్ యజమాని వెంకట్ రెడ్డినీ వివరణ అడగగా సర్వర్ పని చేయడం లేదని సర్వర్ పని చేస్తే నువ్వే ఇస్తానని చెప్పాడు చేసేదేమిలేక రైతు ఇంటికి తిరిగి పోయాడు ఈ విషయంపై రైతు మాట్లాడుతూ గడ్డ గులుకలు లింకు పెట్టిన యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఇది ప్రజా సంక్షేమ ప్రభుత్వం: అరుణారెడ్డి



**శివ్వంపేట, ఆగస్ట్ 31 (జనంసాక్షి):** ఇది ముమ్మాటికీ ప్రజా సంక్షేమ ప్రభుత్వమని సర్పంచ్ అరుణరెడ్డి పేర్కొన్నారు. శివ్వంపేట మండలం సికింద్లాపూర్ గ్రామానికి ప్రభుత్వం నుంచి కొత్తగా స్మార్ట్ కార్డు రూపం వచ్చిన రేషన్ కార్డులను సోమవారం ఆమె ప్రజలకు అందజేశారు. ఈ సర్పంచ్ అరుణరెడ్డి మాట్లాడుతూ అప్పటి ప్రభుత్వం వారి 10 సంవత్సరాల పరిపాలన లో కొత్తగా ఏ ఒక్కరికి కూడా రేషన్ బియ్యం ఇవ్వలేదన్నారు. గత ముఖ్యమంత్రి నిరంకుశంగా వ్యవహరించి, ప్రజా సంక్షేమాన్ని విస్మరించారని ఆమె గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతూ ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏనుగు ప్రభాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బలరాం రెడ్డి, మండల నాయకులు దొంతిరెడ్డి రాంచంద్రారెడ్డి, వార్డు సభ్యులు ప్రవీణ్, అశోక్, స్థానిక నాయకులు సత్యనారాయణ, చేగూరి వెంకటేష్ గౌడ్, నగేష్ చారి మహిళలు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## కంది సాగుపై రైతులకు అవగాహన

**ఉప్పునుంతల (జనంసాక్షి):** ఆత్మనిర్భర్ భారత్ పప్పుధాన్యాల కార్యక్రమంలో భాగంగా ఉప్పునూతల మండలం కంసానిపల్లి గ్రామంలో సోమవారం రైతులకు కంది పంట సాగు, యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కె. రమేష్ మాట్లాడుతూ కంది సాగులో రైతులు శాస్త్రీయ పద్ధతులను పాటించాలని సూచించారు.

నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం, విత్తన శుద్ధి చేయడం, సరైన సమయంలో విత్తుకోవడం, పంటకు అవసరమైన మేరకు సమతుల్య ఎరువుల వినియోగించడం, కలుపు నివారణ చేపట్టడం వంటి అంశాలను వివరించారు. అదేవిధంగా కంది పంటను ఆశించే పురుగులు, తెగుళ్లను గుర్తించి సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. సాగు ఖర్చులు తగ్గించుకొని అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని కోరారు.

## ఇందిరమ్మ ఇండ్లతో పేదల కల సాకారం

• ఎమ్మెల్యే సంజీవరెడ్డి



**కంగ్టి, ఆగస్టు 31(జనంసాక్షి):** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేద ప్రజల కల సాకారం అవుతుందని నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎడ్ల రేగడి తండాలో జమున బాయి, పవార్ అనితలు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇండ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తండాలో గిరిజనులు సాంప్రదాయ నృత్యాలతో ఎమ్మెల్యే కు స్వాగతం పలికారు. ఇండ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు. మంజూరైనా ప్రతి ఒక్కరు ఇండ్లను నిర్మించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రావ్ సింగ్, బాలరామ్, శివాజీ పాటిల్, పండరి రెడ్డి, సర్దార్, రాములు, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

## చిరుతల పంజాలో మూగజీవాలు బలి..

• రైతుల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న చిరుతలు
• పొలాల వైపు అడుగేస్తే..చిరుతల భయం!
• ఏడాదిగా చిరుతల హల్‌చల్..అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యమా..!



**గండీడ్,ఆగస్టు 31(జనంసాక్షి):** గండీడ్ మండలం కొండాపూర్ లో చిరుత దాడిలో ఎద్దు మృతి చెందింది. గండీడ్ మండల పరిధిలోని కొండాపూర్ గ్రామానికి చెందిన,చెన్నారం వెంకటయ్య ఆదివారం సాయంత్రం పొలం వద్ద ఎద్దులను కట్టేసి ఇంటికి వెళ్లాడు.రాత్రి చిరుత దాడిచేసి ఓ ఎద్దును చంపి కొంత భాగం తిన్నట్లు రైతు తెలిపారు.సోమవారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా ఎద్దు మృతి చెంది కనిపించింది.ఎద్దు విలువ సుమారు రూ.50 వేలు విలువచేసే ఎద్దు చిరుత దాడిలో చనిపోవడంతో,రైతు ఆవేదన వ్యక్తం చేశారు. కొండాపూర్, పరిసర గ్రామాల్లో ఏడాదిగా చిరుతల సంచారం కొనసాగుతోందని రైతులు తెలిపారు. ఇప్పటికే పలు మూగజీవాలపై దాడులు జరిగినా అటవీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాత్రివేళ పొలాలకు వెళ్లాలంటే భయంగా ఉందని పేర్కొన్నారు. చిరుతలను పట్టుకునేందుకు బోన్లు ఏర్పాటు చేసి, రైతుకు నిబంధనల ప్రకారం పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.



## రోడ్డు కోసం పాదయాత్ర..

• వెల్దుర్తి-పిల్లికొట్టాల డబుల్ రోడ్డుకు డిమాండ్..
• నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణుల పాదయాత్ర..

**వెల్దుర్తి, ఆగస్టు 31 (జనంసాక్షి):** మెదక్ జిల్లా వెల్దుర్తి-పిల్లికొట్టాల డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం పాదయాత్ర నిర్వహించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వెల్దుర్తి నుంచి మెదక్ కలెక్టరేట్ వరకు పాదయాత్రగా బయలుదేరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా.. ప్రభుత్వం మారిన అనంతరం వాటిని రద్దు చేసి పనులు నిలిపివేశారని నాయకులు ఆరోపించారు. రహదారి అధ్వానంగా ఉండటంతో ప్రజలు, రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే నిధులు విడుదల చేసి డబుల్ రోడ్డు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

## అక్రమంగా నిల్వ ఉంచిన 150 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

• రాజగోపాల్‌పేట ఎస్సై టి.వివేక్



**నంగునూరు, ఆగస్టు 31 (జనంసాక్షి):** మండల పరిధిలోని రామచంద్రపురం (మధిర) గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 150 సంచుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రాజగోపాల్‌పేట ఎస్సై వివేక్ తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు సోమవారం ఉదయం 11:00 గంటల ప్రాంతంలో రాజగోపాల్‌పేట పోలీసులు, సిద్దిపేట టాస్క్ ఫోర్స్ సిబ్బంది కలిసి ఉమ్మడిగా తనిఖీలు చేపట్టారు. గ్రామానికి చెందిన మోతె సాయి తరుణ్ (24, తండ్రి: రాజు) అనే వ్యక్తికి చెందిన ఇంటి ముందు భాగంలో మరియు ఇంటి ఆవరణలోని రేకుల షెడ్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 150 సంచుల బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం సివిల్ సప్లైస్ (రైస్ అండ్ సివిల్ సప్లై డిపార్ట్‌మెంట్) అధికారులకు అప్పగించినట్లు ఆయన వెల్లడించారు. అక్రమ రవాణా, ప్రభుత్వ బియ్యం నిల్వలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఎఫ్‌ఎఫ్‌ఎస్ యాప్‌తో ఎరువుల బుకింగ్‌పై రైతులకు అవగాహన



**మాసాయిపేట, ఆగస్టు 31 (జనంసాక్షి):** మాసాయిపేట రైతు వేదిక, స్థానిక ఎరువుల దుకాణాల వద్ద రైతులకు 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్' (FFS) యాప్ ద్వారా ఎరువుల బుకింగ్ విధానంపై వ్యవసాయ అధికారులు సమగ్ర అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రీ పూర్తికాని రైతులకు యాప్‌లో భూమి వివరాలు కనిపించవని తెలిపారు. కొత్త FFS యాప్ ద్వారా యూరియాతో పాటు DAP, కాంప్లెక్స్, పొటాష్ తదితర అన్ని రకాల ఎరువులను బుక్ చేసుకునే అవకాశం ఉందన్నారు.

రైతులు ప్లే స్టోర్ నుంచి FFS యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తెలుగు లేదా ఇంగ్లీష్ భాషను ఎంచుకోవాలి. ఆధార్ లేదా ఫార్మర్ ఐడీతో మొబైల్‌కు వచ్చే ఓటీపీ ద్వారా లాగిన్ కావాలి. అనంతరం భూమి, సర్వే నంబర్ల వివరాలను పరిశీలించి సాగు చేస్తున్న పంటలను నమోదు చేయాలి. పంట ఆధారంగా అవసరమైన ఎరువుల పరిమాణాన్ని యాప్ సూచిస్తుంది. రైతులు తమకు అవసరమైన పరిమాణాన్ని ఎంచుకుని, ఎరువుల దుకాణాన్ని ఎంపిక చేసి బుకింగ్ చేసుకోవచ్చు.

బుకింగ్ పూర్తయిన తర్వాత QR కోడ్, బుకింగ్ ఐడీ వస్తాయని అధికారులు తెలిపారు. బుకింగ్ చేసిన 48 గంటల్లోపు సంబంధిత దుకాణంలో QR కోడ్ చూపించి ఎరువులు తీసుకోవాలి. ఒకసారి ఎరువులు కొనుగోలు చేసిన తర్వాత 15 రోజుల అనంతరం మాత్రమే మళ్లీ బుకింగ్ చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు.

ఇంతకుముందు యూరియా తీసుకున్న రైతులు సంయమనం పాటించి తోటి రైతులకు కూడా యూరియా అందేలా సహకరించాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి. కవిత, ఏఈఓ భార్గవ్ గౌడ్, ఆత్మ ATM నరేందర్, రైతులు పాల్గొన్నారు.

# టీ పాయింట్, హార్డ్‌వేర్ షాప్‌ను ప్రారంభించిన మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మాదేవేందర్ రెడ్డి

**హవెలి ఘనపూర్ మండలం, ఆగస్టు 31 (జనంసాక్షి):** హవెలిఘనపూర్ మండలంలోని రాజుపేట గేట్ వద్ద బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్ నూతనంగా ఏర్పాటు చేసిన టీ పాయింట్, శివాని హార్డ్‌వేర్ షాప్‌ను సోమవారం మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం.పద్మాదేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు నిర్వాహకుడు శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పరస్పరం కలుసుకునేందుకు టీ పాయింట్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పద్మాదేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా టీ పాయింట్‌తో పాటు హార్డ్‌వేర్ షాప్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం టీ పాయింట్, హార్డ్‌వేర్ షాప్‌ను పరిశీలించి అక్కడి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాస్‌ను అభినందిస్తూ వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు శ్రీనివాస్ మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మాదేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు కొద్దిసేపు స్థానిక నాయకులు, గ్రామస్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సిహెచ్. శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాధాకృష్ణ యాదవ్, సర్పంచ్ నార్ల సాయిలు, మాజీ సర్పంచ్ యామిరెడ్డి, నాయకులు సాయగౌడ్, సతీష్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, సాప సాయిలు, రామచంద్రరెడ్డి, నరేందర్‌రెడ్డి, పోచయ్య, మల్లయ్య, బిక్షపతిరెడ్డి, సిద్ధిరామ్‌రెడ్డి, సిద్ది రెడ్డి రాజేశ్వరరావు, సంతోష్‌గౌడ్, పాండురంగారావు, బాబాగౌడ్, అశోక్, కిషన్, గోపాల్, రవి, నల్ల పోచయ్య, మల్లేశం, భూమయ్య, ఏసు, విట్టల్, మొగులయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### రూ.1,800 కోట్లతో

# మక్తల్ అభివృద్ధి: కౌన్సిలర్ అల్యూరి పావని



**మక్తల్, ఆగస్టు 31 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజా పాలన పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి, సీఎం రేవంత్ రెడ్డిలకు 16వ వార్డు కౌన్సిలర్ అల్యూరి పావని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వెయ్యి రోజుల పాలనలో మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో మక్తల్ నియోజకవర్గానికి రూ.1,800 కోట్ల నిధులు తీసుకొచ్చి చరిత్ర సృష్టించారని కొనియాడారు. మక్తల్ పట్టణానికి చెందిన వ్యక్తి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రి పదవి చేపట్టి ఇంత భారీగా నిధులు తేవడం గర్వకారణమన్నారు. భవిష్యత్తులో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందేలా ఆంజనేయస్వామి ఆశీస్సులు, ప్రజల మద్దతు మంత్రికి ఎల్లప్పుడూ ఉండాలని ఆమె ఆకాంక్షించారు.

# పుల్కల్‌లో కొత్త బస్సుషెల్టర్ నిర్మించాలి




**పుల్కల్,ఆగస్టు 31(జనంసాక్షి):** మండల కేంద్రంలోని పాత బస్సుషెల్టర్ శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలకు సౌకర్యవంతంగా, అందుబాటులో ఉండే అనువైన ప్రదేశంలో నూతన బస్సుషెల్టర్‌ను నిర్మించాలని కోరారు.సోమవారం పుల్కల్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో కొండా లక్ష్మికి గ్రామస్థులు వినతిపత్రం అంద జేశారు. గ్రామం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయా ణికులు బస్సుల కోసం వేచి ఉండేందుకు సరైన సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ముఖ్యంగా మహిళలు, వృద్ధులు,విద్యార్థులు ఎండ, వర్షంలో బస్సుల కోసం నిరీక్షిం చాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న పాత బస్సుషెల్టర్ శిథిలావస్థకు చేరి ఉపయోగిం చేందుకు అనుకూలంగా లేదన్నారు. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నా యని వివరించారు.అధికారులు స్పందించి ప్రజలకు అనువైన స్థలాన్ని గుర్తించి,త్వరితగతిన నూతన బస్సుషెల్టర్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరారు.

# పంటల నమోదు తప్పనిసరి... రైతులు నిర్లక్ష్యం చేయొద్దు

- మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ నాయక్



**ఉప్పునుంతల,(జనంసాక్షి):** రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్ నాయక్ సూచించారు. పంటల నమోదుతో రైతులకు ప్రభుత్వ పరంగా అందే వివిధ ప్రయోజనాలు, మద్దతు ధర పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పంటల నమోదుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామాల వారీగా నియమించిన సిబ్బంది రైతుల పొలాలను సందర్శించి సాగు చేసిన పంట, విస్తీర్ణం తదితర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని చెప్పారు. రైతులు తమ పొలాల్లో సాగు చేసిన పంట వివరాలను సంబంధిత సిబ్బందికి తెలియజేసి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. పంట నమోదు విషయంలో రైతులు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా వ్యవసాయ శాఖ సిబ్బందికి సహకరించాలని వారు సూచించారు.

# బాలిక సంరక్షణ అందరి బాధ్యత: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





**మెదక్ బ్యూరో, ఆగస్టు 31 (జనంసాక్షి):** బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో ఘనంగా రాఖీ వేడుకలు నిర్వహించడం జరిగింది. రాఖీ పౌర్ణమి సందర్భంగా బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరేట్‌లో రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు జిల్లా కలెక్టర్ తోపాటు వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులకు రాఖీలు కట్టి, బాలికల రక్షణ, విద్య, సమానత్వం మరియు సాధికారతకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలనే సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. బాలికల హక్కులు, భద్రత, విద్య భవిష్యత్ అభివృద్ధికి తమ సంపూర్ణ మద్దతును తెలియజేశారు. బాలికలకు సమాన అవకాశాలు కల్పించడం, వారి విద్యను ప్రోత్సహించడం, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. రాఖీ వేడుకల ద్వారా అన్నాచెల్లెళ్ల అనుబంధంతో పాటు బాలికల భద్రత గౌరవాన్ని కాపాడాలనే సామాజిక బాధ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొని "బాలికలను రక్షిద్దాం – బాలికలను చదివిద్దాం" అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమా భార్గవి,బాలికలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేఆర్ఆర్ ట్రస్ట్ చైర్మన్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



**చేర్యాల, ఆగస్టు 31(జనంసాక్షి):** కేఆర్ఆర్ ట్రస్ట్ చైర్మన్ కరెడ్ల రాజేశ్వర్ రెడ్డి తల్లి ప్రమీల (85) ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందగా విషయం తెలుసుకున్న మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హనుమంతరావు సోమవారం మండలంలోని ఆకునూరు గ్రామంలో రాజేశ్వర్ రెడ్డిని పరామర్శించారు. ప్రమీల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాజేశ్వర్ రెడ్డి తల్లి మృతి అత్యంత బాధాకరమని ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొమ్ము రవి, మాజీ సర్పంచ్ వెలుగల రఘువీర్, మత్స్యశాఖ మాజీ చైర్మన్ బోయిని రాజు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ఆకుల రాజు, మాజీ ఎంపిటిసిలు సుంకరి శ్రీధర్, పల్లె కనకయ్య, పార్టీ నాయకులు కోయినేని నరసయ్య, మల్కాజిగిరి కార్పొరేటర్లు వై. ప్రేమ్ కుమార్, మాజీ కౌన్సిలర్ ఎస్ఆర్ ప్రసాద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, జిఎన్వి సతీష్ కుమార్, సత్యనారాయణ, బాబన్న, సుంకు శ్రీనివాస్, రాందాస్, సంతోష్, హరిక్రిష్ణ, రంజిత్ రెడ్డిలతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిధి

- రూ.45.31 లక్షల విలువైన 150 సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 31 (జనంసాక్షి):** ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో అత్యవసర వైద్యం పొందిన పేదలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పంపిణీ చేశారు. మొత్తం రూ.45,31,100 విలువైన 150 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సెప్టెంబర్ 1 నాటికి వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకోనుందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

గత ప్రభుత్వ అప్పులను తీర్చడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎంఆర్ఎఫ్ ద్వారా రికార్డు స్థాయిలో ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని, ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని చికిత్సలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక ఉపశమనం కల్పిస్తున్నామని చెప్పారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ మానవతా దృక్పథంతో సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, రాజేంద్రప్రసాద్ యాదవ్, అక్తర్, దేవన్న యాదవ్, చంద్రశేఖర్, నాగార్జున, అడ్వకేట్ బాబా, ఆవుల చంద్రశేఖర్, కురుమన్నతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంకాల మిట్టలో ఇళ్లస్థలాలు పంపిణీ చేయాలి



**పెంటవల్లి మండల న్యూస్, ఆగస్టు 31 (జనంసాక్షి):**
పెంట్లవెల్లి మండల కేంద్రంలో మంకాలమ్మ మిట్ట సర్వే నెంబర్ 22, 27లో 14 ఎకరాల 36 గంటల భూమిని ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు దాదాపు 20 సంవత్సరాలు గడుస్తున్న. నాటినుండి నేటి వరకు పట్టాలు లేవు పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు లేక తీవ్రమైనటువంటి ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం స్థానిక అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎస్ హన్మంతు ఆవేదన వ్యక్తం చేశారు, సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తాసిల్దార్ భాస్కర్‌కు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని సోమవారం నాడు సిపిఎం పార్టీ పెంట్లవెల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. పెంట్లవెల్లి మండలం నుండి కొల్లాపూర్ ఆర్డీవో కార్యాలయం వరకు పాదయాత్ర చేసి ఆర్డిఓకి ఇట్టి సమస్యపై వినతి పత్రం సమర్పించడం ఉంటుందని మాట్లాడారు. కానీ నేటికీ పరిష్కారం కాక ఆ సమస్య అలాగే ఉందని అన్నారు, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక మంత్రి దీనిపై చర్య తీసుకుని తక్షణమే అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి ఇందిరమ్మ ఇంటినీ నిర్మించి ఇవ్వాలని అన్నారు. లేనిచో ప్రజలందరిని సమీకరించి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



**ఇటిక్యాల, ఆగస్టు 31(జనంసాక్షి):** ఆస్పత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని డిఎం హెచ్ఓ సంధ్యాకిరణ్మయి వైద్య సిబ్బందికి సూచించారు. సోమ వారం ఇటిక్యాల పీహెచ్ సీను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె ఆస్పత్రిలోని ఓపి, సిబ్బంది రిజిస్టర్లను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను మరింత పెంచాలని, ఆస్పత్రికి వచ్చే గర్భిణీలకు ప్రతినెల పరీక్షలు చేస్తూ వారికి ఆరోగ్యం పట్ల తగిన సూచనలు, సలహాలు చేయాలన్నారు. అనంతరం ఆస్పత్రిలోని పరిసరాలను, స్టాక్ వివరాలను, రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట ఇటిక్యాల పిహెచ్ సీ డాక్టర్ రాధిక, వైద్య సిబ్బంది ఉన్నారు.

## అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం

- **ఆదర్శ గ్రామంగా ఉప్పరిపల్లిని తీర్చిదిద్దడమే లక్ష్యం**



**ఉప్పునుంతల, (జనంసాక్షి):** మండల పరిధిలోని ఉప్పరిపల్లి గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు గ్రామ సర్పంచ్ బొజ్జ గీతారెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఎం ప్రవాసి ప్రజావాణి రాష్ట్ర కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి హాజరై పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బొజ్జ గీతారెడ్డి, బొజ్జ అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. గ్రామ ప్రజలకు విద్య, వైద్యం, మౌలిక వసతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సహకారంతో ఉప్పరిపల్లిని అన్ని విధాలా అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులతో గ్రామంలో పారిశుద్ధ్య సమస్యలు తగ్గడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని వారు తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ శ్రీనివాస్ చారి, వార్డు సభ్యులు వెంకటయ్య, పర్వతాలు, సువర్ణ, భారతమ్మ, లక్ష్మి, గ్రామ పెద్దలు ప్రభాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఎం. శేఖర్ గౌడ్, కే. శేఖర్ గౌడ్, తొల్ల రాజు, కుమ్మరి వెంకటయ్య, ఎదురుశెట్టి సురేష్, శేఖర్ రెడ్డి, శ్రీనివాసు రెడ్డి, పానుగంటి పర్వతాలు, పానుగంటి రవి తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయ నిధి వరం



**వెల్దండ, ఆగస్టు 31 (జనంసాక్షి):** ఆపదలో ఉన్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ వరంలా ఉంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. వెల్దండ మండలం కొట్ర గ్రామానికి చెందిన మహమ్మద్ యూసుఫ్ ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.ఆస్పత్రి ఖర్చులకు ఇబ్బందిగా ఉన్న విషయాన్ని గ్రామ సర్పంచ్ శాంపురి శారద చెన్నయ్య ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయారు. దీంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సోమవారం బాధిత కుటుంబానికి రూ.2 లక్షల చెక్కును అందజేశారు. సందర్భంగా సర్పంచ్ మరియు బాలిక కుటుంబం ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య యాదవ్, సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ యువ నాయకులు ఎండి సద్దాం, కాలూరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టులకు రైల్వే రాయితీ పునరుద్ధరించండి

**గద్వాల, ఆగస్టు 31(జనంసాక్షి):** వర్కింగ్ జర్నలిస్టులకు రైల్వే ప్రయాణ రాయితీని పునరుద్ధరించాలని కోరుతూ గద్వాల జర్నలిస్టులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సోమవారం గద్వాల పర్యటనకు వచ్చిన మంత్రిని కలిసిన జర్నలిస్టులు కరోనా సమయంలో నిలిపివేసిన రాయితీని ఇప్పటివరకు పునరుద్ధరించకపోవడంతో జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ నాలుగో స్తంభంగా విధులు నిర్వర్తిస్తున్న జర్నలిస్టులకు రైల్వే రాయితీ ఎంతో అవసరమని, తరచూ ప్రయాణాల వల్ల ఆర్థిక భారం పెరిగిందని పేర్కొన్నారు. కేంద్రం సానుకూలంగా స్పందించి రాయితీని వెంటనే పునరుద్ధరించాలని కోరారు. దీనిపై మంత్రి పరిశీలిస్తామని హామీ తెలిపారు.

## 40 ఏళ్ల సుదీర్ఘ సేవకు వీడ్కోలు...

- **శ్రీరంగాపూర్ ఎంపీడీవో సులోచన పదవీ విరమణ**
- **ఘనంగా సన్మానించిన సిబ్బంది, ప్రజాప్రతినిధులు**



**శ్రీరంగాపూర్, ఆగస్టు 31 (జనంసాక్షి):** శ్రీరంగాపూర్ మండల ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న ఎస్. సునీత సోమవారం (31-08-2026) పదవీ విరమణ పొందారు. 40 ఏళ్ల సుదీర్ఘ ప్రభుత్వ సేవకు ఆమె వీడ్కోలు పలికారు. 1986లో జూనియర్ అసిస్టెంట్ గా ప్రారంభమైన ప్రస్థానం..

ఎస్.సునీత 25-03-1986న మహబూబ్ నగర్ పీఎస్ బ్లాక్ లో జూనియర్ అసిస్టెంట్ గా తన ప్రభుత్వ ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అంచెలంచెలుగా ఎదుగుతూ సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్ గా వివిధ మండలాల్లో, జిల్లా పరిషత్, డీఆర్డీఏ, పీఆర్ డివిజన్, ఆర్డబ్ల్యూఎస్ వంటి శాఖల్లో విధులు నిర్వహించారు. చివరిగా 24-06-2026 నుండి శ్రీరంగాపూర్ మండల ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టి, నేటితో పదవీ విరమణ పొందుతున్నారు.ఆమె 10-08-1965న జన్మించారు. వెలుగొండ, మహబూబ్ నగర్ లో విద్యాభ్యాసం పూర్తి చేశారు. 1988లో వివాహం జరిగింది. వారి భర్త పీఆర్ శాఖలో టెక్నికల్ ఆఫీసర్ గా రిటైర్డ్ అయ్యారు. కుమారుడు రోహిత్ చంద్ర, కుమార్తె ప్రియాంక ఇద్దరూ యూఎస్ఏలో ఉన్నత విద్య, ఉద్యోగాలు చేస్తున్నారు.

## జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డు ఇంత అధ్వానమా

- **పోతులబోగూడ నుంచి పాదయాత్ర షురూ**




**శివ్వంపేట, ఆగస్టు 31(జనంసాక్షి):** శివ్వంపేట మండలం పోతులబోగూడ నుంచి వెల్దుర్తి మీదుగా మెదక్ శివారులోని పిల్లికొట్టాల్ వరకు ఉన్న ప్రధాన రహదారిని వెంటనే బాగుచేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మొదలైన పాదయాత్ర ను ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి సోమవారం ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షులు రమణాగౌడ్ ఆధ్వర్యంలో శివ్వంపేట మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పోతులబోగూడ చౌరస్తాకు చేరుకొని అక్కడ ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి పాదయాత్ర మొదలు పెట్టారు. జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డు ఇంత అధ్వానంగా ఉంటుందా అని ఆమె ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం వెంటనే స్పందించి, ఈ రోడ్డును మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. నిరంతరం ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలకు సిద్ధమవుతామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, ఆత్మ కమిటి మాజీ చైర్మన్ గొర్రె వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు సంతోష్, రాజశేఖర్, మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగి జీవితంలో పదవి విరమణ సహజం ఎంఈఓ రాంరెడ్డి



**వెల్దండ ఆగస్టు 31(జనంసాక్షి) :** ప్రతి ఉద్యోగి జీవితంలో పదవి విరమణ అనేది సర్వ సాధారణమని ఎంఈఓ రాంరెడ్డి అన్నారు వెల్దండ మండల కేంద్రంలోని జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్లో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించిన ఉప్పునుంతల చంద్రశేఖర్ పదవి విరమణ సన్మాన కార్యక్రమాన్ని వెల్దండ మండల కేంద్రంలోని ఆకృతి గార్డెన్ లో నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ రాంరెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలాపూర్‌లో నూతన ప్రాథమిక పాఠశాల భవనం నిర్మించాలి

- **బీఎస్పీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతి**



**ఉప్పునుంతల, (జనంసాక్షి):** ఉప్పునుంతల మండలం తిరుమలాపూర్ గ్రామంలో నూతన ప్రాథమిక పాఠశాల భవనాన్ని వెంటనే నిర్మించాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అచ్చంపేట నియోజకవర్గ బీఎస్పీ నాయకులు పాల్గొని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

తిరుమలాపూర్ గ్రామంలో నూతన పాఠశాల భవనం నిర్మాణం కోసం గత వారం ఉప్పునుంతల మండల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు నాయకులు తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో నూతన పాఠశాల భవన నిర్మాణానికి మంజూరు చేశామని చెప్పి సుమారు పదేళ్లుగా కాలయాపన చేశారని బీఎస్పీ నాయకులు ఆరోపించారు. ప్రస్తుతం అస్పష్టస్థాయిల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ పాఠశాల భవన నిర్మాణ పనులు ప్రారంభించకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జి ఉల్పర కృపానందం, అసెంబ్లీ కార్యదర్శి బరిగల శ్రీను, నాయకులు వీరబాబు, సురేష్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే బీరం జన్మదిన వేడుకలు

- **భారీ బైక్ ర్యాలీ నిర్వహించిన బీఆర్ఎస్ శ్రేణులు**

**చిన్నంబావి, ఆగస్టు 31 (జనంసాక్షి):** కొల్లాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి 48వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని చిన్నంబావి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి, అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. నాయకులు, కార్యకర్తలు బీరం హర్షవర్ధన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో చిన్నంబావి మండల కేంద్రంలో సందడి నెలకొంది. పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఉమ్మడి మండలాల ఇన్‌చార్జ్ గోవిందు శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ మధుసూదన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కేసిరెడ్డి వెంకటరామమ్మ చిన్నారెడ్డి,



వెలగొండ సర్పంచ్ శరత్‌రెడ్డి, చెల్లెపాడు సర్పంచ్ పెద్ద నర్సింహ, చిన్నమారూర్ సర్పంచ్ శంకర్, చిన్నంబావి మాజీ సర్పంచ్ రంజిత్ కుమార్, వద్దేమాన్ రామకృష్ణ, రాజురెడ్డి, డేగ శేఖర్, మద్దిలేటి, కురుమయ్య, జీవీకే నాయుడు, రాజు, జింకల రమేష్, మాజీ సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉదండాపూర్
# నిర్వాసితులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా

- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల ఆగస్టు 31 (జనంసాక్షి):** జడ్చర్ల నియోజకవర్గ పరిధిలోని ఆర్‌అండ్ ఆర్ సెంటర్‌లో రూ. 13.69 కోట్లతో చేపట్టే అంగన్వాడీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశు వైద్యశాల, ఫంక్షన్ హాళ్లు, కమ్యూనిటీ భవనాల నిర్మాణ పనులకు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. నిర్వాసిత కుటుంబాలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు పట్టించుకోని ఉదండాపూర్ నిర్వాసితుల సమస్యలపై ప్రభుత్వంపై పోరాడి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని రూ. 6.50 లక్షల నుండి రూ. 18 లక్షలకు పెంచినట్లు తెలిపారు. ఇప్పటికే రూ. 650 కోట్లు నిర్వాసితుల ఖాతాల్లో జమ అయ్యాయని వెల్లడించారు. ప్రాజెక్టును ఉదండాపూర్ వరకు పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించానని చెప్పారు. అలాగే నిర్వాసితులందరూ ఏకాభిప్రాయానికి వస్తే ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తామని హామీ ఇచ్చారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి: ఎంఈఓ అబ్దుల్ రహీం

- ఊరుకొండ పేట ప్రాథమిక పాఠశాలను తనిఖీ



**ఊర్కొండ,ఆగస్ట్ 31, (జనంసాక్షి):** విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాధికారి అబ్దుల్ రహీం ఆదేశించారు. ఊరుకొండ మండలం ఊరుకొండ పేట ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన వసతులు, వంట గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు వేడి వేడిగా, నాణ్యమైన భోజనం అందించాలన్నారు. భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాల పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, బోధన తీరును కూడా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం రుచి, మౌలిక వసతులపై ఆరా తీశారు.

# నవాబుపేటలో 'పోలీస్ కళాజాత'.. ఆటపాటలతో సామాజిక అంశాలపై అవగాహన

**నవాబుపేట, ఆగస్టు 31 (జనంసాక్షి):** నవాబుపేట మండల కేంద్రంలోని పాత గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం సాయంత్రం పోలీస్ కళాజాత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాజాత బృందం సభ్యులు తమ ఆట, పాటలు మరియు నాటికల ద్వారా పలు సామాజికాంశాలపై ప్రజలకు కళ్లకు కట్టినట్లు వివరించారు. కళాజాత బృందం ప్రధానంగా బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, గృహహింస, షీ టీమ్స్ (SHE Teams), రోడ్డు భద్రత, సైబర్ నేరాలు మరియు మాదకద్రవ్యాల (Drugs) దుష్ప్రభావాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించింది. ముఖ్యంగా మానవ అక్రమ రవాణా (Human Trafficking) వల్ల జరిగే నష్టాలు, అక్రమ రవాణాకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్యపరిచారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని, సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు, పిల్లలపై జరిగే హింస మరియు ఇతర సామాజిక సమస్యల నిర్మూలనకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట ఎస్ఐ (SI) నరేందర్, హెచ్‌సి



సురేష్, నవాబుపేట సర్పంచ్ గీతారాణి, కళాజాత సిబ్బంది ఏఎస్ఐ సక్రియ, హెచ్‌సీలు రాములు, జ్యోతి, పీసీలు జగదీష్, బాలరాజుతో పాటు స్థానిక ప్రజలు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నీలిపల్లిలో పౌర హక్కుల గ్రామసభ



**మల్దకల్, ఆగస్టు 31 (జనంసాక్షి):** మండల పరిధిలోని నీలిపల్లి గ్రామంలో సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పౌర హక్కుల గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు జిపిఓ పరశురాముడు హాజరై మాట్లాడుతూ గ్రామంలో అంటరానితనము,రెండు గ్లాసుల పద్ధతి,దేవాలయ ప్రవేశం, కులవివక్షత పాటిస్తే చర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెద్ద తిమ్మప్ప, అంగన్వాడి టీచర్ జయమ్మ, వార్డు సభ్యులు రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పునుంతలలో నేడు విద్యార్థులకు క్రీడా పోటీలు

- ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి



**ఉప్పునుంతల, (జనంసాక్షి):** ఉప్పునుంతల మండల కేంద్రంలోని పియంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం 10 గంటలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (బా+భీ) ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీసి, వారిని ప్రోత్సహించేందుకు ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి విద్యార్థులు ఉపాధ్యాయులు ప్రజా ప్రతినిధులు హాజరై ఈ క్రీడా కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరు కోరారు.

# సొంత ఇంటి కల కాలి బూడిద అయింది





**రాజాపూర్, ఆగస్టు 31(జనంసాక్షి):** మండల పరిధిలోని తిరుమాలాపూర్ గ్రామంలో అజమోని పార్వతమ్మ, బుద్దుల వెంకటమ్మ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు మొదలు పెట్టడంతో, ముదిరాజ్ భవనంలో తమ ఇంటి సామగ్రి, బంగారం, వెండి, నగదు పెట్టుకొని ఉంటున్నారు. సోమవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగి వంట సామాగ్రి, నగదు, బంగారం, వెండి,బట్టలు, బియ్యం కాలి బూడిద అయ్యాయని, చివరి నిమిషంలో ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను ఆర్పాయని బాధితులు తెలిపారు. తాము ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం చేసుకోవాడానికి దాచుకున్న సొమ్ము కాలి బూడిద అయింది అని మా ఇళ్ళు నిర్మాణం చేసుకోవాడానికే కాకుండా, నిలునీడ లేని పరిస్థితి నెలకొంది అని బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. ఇంట్లో దాదాపు 12 లక్షల ఆస్తి కాలి బూడిద అయింది అని బాధితులు అంటున్నారు.ప్రభుత్వం స్పందించి ఆర్థిక సాయం అందించాలని, ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణానికి సహాయం అందించాలని బాధితులు కోరుతున్నారు.

# వ్యాపార సంఘం వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా బరిగెల శ్రీనివాస్..



**మిడ్జిల్, ఆగస్టు 31(జనంసాక్షి):** వ్యాపార సంఘం వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా బరిగెల శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వ్యాపార సంఘం అధ్యక్షులు గంజి కృష్ణ తెలిపారు. సోమవారం మిడ్జిల్ మండల కేంద్రంలో అంబేద్కర్ భవనం వద్ద వ్యాపార సంఘం సభ్యులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వచ్చే నెల వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు వ్యాపార సంఘం సభ్యులందరూ కృషి చేయాలని అన్నారు. వ్యాపార సంఘం వినాయక ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా k. భాస్కరాచారి , మద్ది వెంకటరెడ్డి, అశోక్ రెడ్డి, నామిని శంకర్. ప్రధాన కార్యదర్శి మామిడిమాడ శ్రీనివాసులు. కోశాధికారి ఎలమ శెట్టి శ్రీనివాసులు. సహాయ కోశాధికారి శ్రీకాంత్ రెడ్డి కార్యదర్శులు... భాస ఆంజనేయులు, లాలు ,వాడ్యాల నరసింహులు, ఎడ్ల మల్లేష్, బసవరాజ్. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వాహకులు.. ఎన్ రాజేశ్వర్. ప్రచార కార్యదర్శులు... బరిగెల రవీంద్ర, బోయిన్‌పల్లి శ్రీధర్. సలహా దారులు... డాక్టర్ రమేష్, భాస్కరాచారి, మిడిదొడ్డి విజయ్, గంజి శేఖర్, c.నరసింహ , p. నరసింహ m.అశోక్ , m. శేఖర్, కైలాస్, లక్ష్మణ్ తదితరులు ను ఎన్నుకున్నారు.

# విద్య, వైద్యం, ప్రజా సమస్యలు పరిష్కరించాలి

**అమరచింత, ఆగస్టు 31 (జనంసాక్షి):** మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న విద్య, వైద్యం, మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి, కార్యదర్శివర్గ సభ్యులు బి. వెంకటేష్, ఆర్.ఎన్. రమేష్, ఎస్. అజయ్, టీ. రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల కొరతను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు.

మండలంలోని ప్రభుత్వ వైద్య సేవలను మెరుగుపరచాలని, డీఎంఆర్ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పేదలకు ఉచితంగా, నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మండలంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, పెన్షన్లు, రేషన్, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబం




ధించిన సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు విద్య, వైద్యం, మౌలిక వసతులు హక్కుగా అందే వరకు పోరాటం కొనసాగిస్తామని, సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మాధవిరాజేందర్, రవి, బుచ్చన్న, మాజీ సర్పంచ్ గోపాల్, శ్యాంసుందర్, అరుణ్, శ్రీను, శంకర్, చంటి, అంజి, విష్ణు, హరీష్, రాములు, కర్ణ తదితరులు పాల్గొన్నారు.

## టియుడబ్ల్యూజే (హెచ్ 143)
# మండల అధ్యక్షుడిగా అమర్‌నాథ్ గౌడ్



**జడ్చర్ల, ఆగస్టు 31(జనంసాక్షి):** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (హెచ్ 143) జడ్చర్ల మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం స్థానిక అంబేద్కర్ కళాభవన్‌లో అడ్‌హాక్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులకు నూతన సభ్యత్వ కార్డులను అందజేశారు. పట్టణానికి చెందిన జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరై సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మేరకు మండల అధ్యక్షుడిగా టీవీ 5 జర్నలిస్ట్ అమర్‌నాథ్ గౌడ్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్ రెడ్డి (నవతెలంగాణ), ఉపాధ్యక్షులుగా ఎం.డి. ఖాజా మొహినుద్దీన్, పి. రఘు, కోశాధికారిగా ఎస్. చెన్నయ్య, సంయుక్త కార్యదర్శులుగా వడ్ల వేణు, సురేష్, ప్రచార కార్యదర్శిగా కిరణ్ కుమార్, కార్యనిర్వహణ సభ్యులుగా అశోక్ కుమార్, మహేష్ కుమార్, నిసార్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అడ్‌హాక్ కమిటీ నాయకులు వి.శివ కుమార్, చింతకాయల వెంకటేష్, సభ్యులు రవి కుమార్, నరేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

- విద్య, వైద్యం, సాగునీరు, రహదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి
- సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తాం
- సీపీఎం మండల కార్యదర్శి బి.శివవర్మ




**కొల్లాపూర్, ఆగస్టు 31 (జనంసాక్షి):** విద్య, వైద్యం, సాగునీరు, రహదారులు, ఇళ్ల నిర్మాణం, పింఛన్లు తదితర ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం కొల్లాపూర్ మండల కార్యదర్శి బి. శివవర్మ విమర్శించారు. ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కొల్లాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు సమర్పించారు.

ఈ సందర్భంగా బి. శివవర్మ మాట్లాడుతూ.. రామాపూర్ గ్రామంలో ప్రధాన రహదారిని నిర్మించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలకు నూతన భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. చింతలపల్లి గ్రామానికి సాగునీరు అందించాలని, రహదారులు నిర్మించాలని, ఎస్సీ కాలనీ నుంచి స్మశానవాటికకు రోడ్డు వేయాలని కోరారు. హైస్కూల్‌కు ప్రహరీగోడ, మరుగుదొడ్లు నిర్మించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను, ఆశా వర్కర్ల ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

నార్లాపూర్ గ్రామంలోని పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నందున నూతన భవనం నిర్మించాలని, గ్రామంలో రహదారులను తక్షణమే ఏర్పాటు చేయాలని అన్నారు. కొల్లాపూర్ నుంచి ముక్కిడిగుండం వరకు రహదారి నిర్మించాలని, జిల్లార్ల తిప్ప చెరువుకు కేఎల్ఐ, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించాలని కోరారు. సాగు చేసుకుంటున్న రైతులకు అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అమరగిరి గ్రామానికి తక్షణమే రహదారి నిర్మించాలని, కొల్లాపూర్‌లోని ఇంటర్మీడియట్ కళాశాలకు నూతన భవనం ఏర్పాటు చేయాలని కోరారు. పీజీ కళాశాల స్థలాన్ని అక్రమంగా ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, మారుమూల ప్రాంతాలైన అమరగిరి, తీర్ణంపల్లి, గేమ్యా నాయక్ తండా, తెల్లపులుకుతండా, చింతలపల్లి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. పింఛన్ల కోసం దరఖాస్తు గడువును పొడిగించి, అర్హులైన వారికి ఆసరా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ఆందోళనలు, పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని బి. శివవర్మ హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి ఎం.డి. సలీం, మండల నాయకులు బత్తిని రాజు, రామకృష్ణ, సభ్యులు సంజీవ్, సాయి, నాని, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీని తనిఖీచేసిన జిల్లా అధికారులు..

- డీఈవో,విజయకుమారి..గైర్హాజరైన
- గణితం ఉపాధ్యాయురాలికి..షోకాజ్ నోటీసు



**మహమ్మదాబాద్,ఆగస్టు 31(జనంసాక్షి):** మహమ్మదాబాద్ మండల కేంద్రంలో ఉన్న కేజీబీవీని (డీఈవో) ఐ.విజయకుమారి, సోమవారం తనిఖీ చేశారు.విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వసతులు, విద్యాబోధన, భద్రతపై ఆరా తీశారు. ఆదివారం ముందస్తు సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన డ్యూటీ టీచర్,సీఆర్టీ గణితం ఉపాధ్యాయురాలు పి.నాగరాణికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు.కేజీబీవీ సీసీ ఫుటేజ్‌ను పరిశీలించగా గేటు వద్ద వాచ్‌మన్,మరో వర్కర్ ఉన్నట్లు,గేటుకు తాళం వేసి ఉన్నట్లు గుర్తించామని అధికారులు తెలిపారు.

సిబ్బంది మధ్య సమన్వయ లోపంపై నివేదికను కలెక్టర్‌కు సమర్పించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.విద్యార్థుల భద్రత విషయంలో రాజీ లేదని డీఈవో స్పష్టం చేశారు.ఈకార్యక్రమంలో కేజీబీవీ, జిసిఈఓ,ఆశ్రకాద్రి,జిల్లా విద్యాధికారి,విజయకుమారి,మండల విద్యఅధికారి ఎంఈఓ, రాజునాయక్, పాల్గొన్నారు.

## ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- నోడల్ ఆఫీసర్ వరుణ్ తేజ్



**ఉప్పునుంతల, (జనంసాక్షి):** మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజావాణి నోడల్ ఆఫీసర్ వరుణ్ తేజ్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమానికి ఎలాంటి దరఖాస్తులు రాలేదని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి ఒక మంచి వేదిక అని పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఏ శాఖకు సంబంధించిన సమస్య ఉన్నా ప్రజలు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రజలు ప్రజావాణి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని నోడల్ ఆఫీసర్ వరుణ్ తేజ్ కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణ మండల ప్రజావాణికి 2 దరఖాస్తులు

**కృష్ణ, ఆగస్టు 31(జనంసాక్షి):** కృష్ణ మండలంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో 2 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. అందులో 2 దరఖాస్తులు కున్సీ గ్రామానికి చెందిన రెవిన్యూ డిపార్టుమెంటుకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయని నోడల్ అధికారి కిషోర్ కుమార్ తెలిపారు.

## వైస్ చైర్‌పర్సన్ శైవి రెడ్డి ఉదారత

- 4 నెలల గౌరవ వేతనం ప్రజాసేవకే అంకితం



**మక్తల్, ఆగస్టు 31 (జనంసాక్షి):** ప్రజాసేవకే తన ప్రాధాన్యమని నిరూపిస్తూ వైస్ చైర్‌పర్సన్ శైవి రెడ్డి తన 4 నెలల గౌరవ వేతనాన్ని పలు సామాజిక కార్యక్రమాలకు వెచ్చించి ఆదర్శంగా నిలిచారు. ఎన్నో ఏళ్లుగా ఎండనక, వాననక రోడ్డు పక్కన చెప్పులు కుడుతూ జీవనం సాగిస్తున్న వృద్ధురాలు హరిజన సీతమ్మ శ్రమను గుర్తించిన శైవి రెడ్డి, ఆమెకు అండగా నిలవాలనే ఉద్దేశంతో తన మొదటి నెల గౌరవ వేతనం రూ. 7,000ను ఆర్థిక సహాయంగా అందజేశారు. అలాగే, విద్యార్థుల రక్షణను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ ఎంపీపీఎస్ పాఠశాలలో సీసీ కెమెరాల కొనుగోలు నిమిత్తం రూ. 12,000 వేతనాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు. భావి భారత పౌరులైన విద్యార్థుల భద్రతకు తన వంతు సహకారం అందించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. మరో రూ. 10,000 గౌరవ వేతనాన్ని పులిమామిడి ఆలయ పరిసరాల్లో భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్డి నిర్మాణానికి అందజేశారు.

మంత్రి వాకిటి శ్రీహరిని ఆదర్శంగా తీసుకుంటూ నిరంతరం ప్రజల్లోనే ఉంటానని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటానని శైవి రెడ్డి స్పష్టం చేశారు. తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పనపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. శైవి రెడ్డి చేపట్టిన ఈ సేవా కార్యక్రమాలపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రాహుల్‌పై కేసును నిరసిస్తూ కాంగ్రెస్ ధర్నా



**మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 31 (జనంసాక్షి):** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై నమోదు చేసిన కేసును నిరసిస్తూ మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అధ్యక్షత వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛ, గౌరవంతో జీవించే హక్కును కల్పించిందన్నారు. రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా కుల వివక్షను ప్రోత్సహించే చర్యలకు పాల్పడటం దురదృష్టకరమని విమర్శించారు. కుల వివక్షకు వ్యతిరేకంగా, సామాజిక సమానత్వం కోసం పోరాడుతున్న రాహుల్ గాంధీపై అక్రమంగా కేసు నమోదు చేయడం ప్రజాస్వామ్యాన్ని అణిచివేసే ప్రయత్నమని ఆరోపించారు. సామాజిక న్యాయం కోసం ప్రశ్నించే గొంతులను కేసులు, బెదిరింపులతో అణచలేరని స్పష్టం చేశారు. దేశంలో కుల, మత విభేదాలను రెచ్చగొట్టి ప్రజలను విభజించే ప్రయత్నాలను కాంగ్రెస్ సహించదన్నారు. రాజ్యాంగం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలు, సామాజిక న్యాయం, సమానత్వ పరిరక్షణ కోసం పార్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు. రాహుల్ గాంధీపై నమోదు చేసిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని, కుల వివక్షకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, బెక్కరి మధుసూదన్‌రెడ్డి, పొల్లెపల్లి యాదయ్య, వినోద్‌కుమార్, రాములు యాదవ్, సాయిబాబా తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఏదుల ఎమ్మార్వోను తక్షణమే సస్పెండ్ చేయాలి

- చీర్కపల్లి గ్రామ రైతు బంకల అజయ్



**రేవల్లి, ఆగస్టు 31 (జనంసాక్షి):** ఏదుల మండల కేంద్రం లోని చీర్కపల్లి గ్రామంలో భూ రిజిస్ట్రేషన్ కలకలం రేపింది. బాధితుడు బంకల అజయ్ తెలిపిన వివరాల ప్రకారం

చీర్కపల్లి గ్రామంలోని సర్వేనెంబర్ 150 లో 9 ఎకరాల 37 గుంటలు, 151 లో 12 ఎకరాల ఒక గుంట, మొత్తం విస్తీర్ణం 22 ఎకరాల ఇనాం భూమి గ్రామంలో గల ఎస్సీలపై పట్టా కలదు. అందులో భాగాల ప్రకారంగా 2019లో గ్రామంలో పెద్దల సమక్షంలో రాసుకున్న భాగాల ప్రకారంగా గ్రామంలో ఓ వ్యక్తికి భూమి లేదు. తాను గ్రామంలో పెద్ద మనిషిగా చలామణి అవుతున్న సమయంలో బాగాస్తుల లో ఉన్న అందరి భాగంలో నుంచి ఒక్కో గుంటను తీసి, రెండు ఎకరాల పైన జమ చేసుకొని అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తికి అమ్మడం జరిగిందని ఆరోపించారు. అజయ్ తండ్రి అయిన బంకల రాములుకు రావాల్సిన 04 గంటల భూమిని పట్టా చేసుకొని అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తికి అమ్ముతున్నాడని గుర్తించిన అజయ్ ఏదుల సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో రిజిస్ట్రేషన్ ఆపాలని అభ్యర్థించిన స్థానిక ఎమ్మార్వో పట్టా ఆపకుండా మరో వ్యక్తిపై పట్టా చేశారని బంకల అజయ్ ఆరోపించారు. అభ్యంతరం తెలిపిన ఆపకపోవడానికి గల కారణాలు ఎమ్మార్వో చెప్పాలని, అమ్మిన సొమ్ములో ఎమ్మార్వో ఏమైనా వాటా ఉందా అని ప్రశ్నించారు? సదరు వ్యక్తికి 151 సర్వే నెంబర్లు పట్టా భూమి అసలు లేనేలేదని ఈ విషయం ఎమ్మార్వో కు తెలియజేశానని అన్నారు. స్థానిక ఎమ్మార్వో ఇష్టానుసారం రిజిస్ట్రేషన్లు చేస్తూ చిన్న, సన్నకారు రైతులమైన మాకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపైన సమగ్ర విచారణ జరిపి ఎమ్మార్వో తక్షణమే సస్పెండ్ చేయాలని కోరారు లేనియెడల జిల్లా కలెక్టర్కు ఆర్డిఓ అధికారికి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

**కోర్టు ఉత్తర్వుల మేరకే రిజిస్ట్రేషన్ చేశాం: ఏదుల ఎమ్మార్వో తస్కిన్ ముబీన**

గ్రామ శివారులో గల పట్టా ఉన్న భూమికి స్లాట్ బుకింగ్ ఉన్న మేరకు మాత్రమే రిజిస్ట్రేషన్ రిజిస్ట్రేషన్ చేశామని స్లాట్ బుకింగ్ చేసుకున్న తర్వాత రిజిస్ట్రేషన్ ఆపే హక్కులు తమకు లేవని, బంకల రాములు కు నెల రోజులకు పైగా సమయం ఇచ్చామని అతడు ఎలాంటి పత్రాలు తీసుకురాలేదని, కోర్టు ఉత్తర్వుల మేరకే మరో వ్యక్తిపై పట్టా మార్పిడి చేశామని ఏదుల ఎమ్మార్వో తస్కిన్ ముబీన తెలిపారు. బంకల రాములు కు భూమిని సర్వే ద్వారా తనకు రావాల్సిన 04 గుంటల భూమిని సర్వే చేయిస్తామని తెలిపారు.

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి స్వాగతం పలికిన కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 31(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి ప్రారంభోత్సవానికి సోమవారం ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి మర్యాద పూర్వకంగా నారాయణ పేట జిల్లా కలెక్టర్ సి ఎచ్ ప్రియాంక పూల బొక్కేను అందజేసి స్వాగతం పలికారు.

### పేటలో సిరి మల్టీ స్పెషాలిటీ

## ఆస్పత్రిని ప్రారంబించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**నారాయణపేట జిల్లా బ్యూరో ఆగస్టు 31(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కేంద్రంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రతంగ్ పాండు రెడ్డి సిరి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను సోమవారం కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జీ.కిషన్ రెడ్డి ప్రారంబించారు.

ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన పాలమూరు ఎంపీ డీకే అరుణ పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి ఎచ్. ప్రియాంక, జిల్లా ఎస్పీ వినీత్, మున్సిపల్ చైర్మన్ శ్వేత సత్య యాదవ్, వైస్ చైర్మన్ మంజుల జీ ఆర్ రెడ్డి,బిజెపి సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ, రాష్ట్ర నాయకులు పవన్ కుమార్ రెడ్డి, భరత్ ప్రసాద్, గువ్వల బాలరాజు, పగుడాకుల శ్రీనివాసులు, బి.కొండయ్య, జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్, నాయకులు రఘురామయ్య గౌడ్, జి ఆర్ రెడ్డి, బలరాం రెడ్డి, తిరుపతి రెడ్డి,లక్ష్మీ శ్యామ్ సుందర్, బొక్క బాల్ రెడ్డి, కార్పొరేటర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఉమేష్, మహబూబ్ అలీ, శ్రీవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరంగాపూర్ మండలంలో శాస్త్రవేత్తల క్షేత్ర సందర్శన

- **రైతులకు సాంకేతిక సూచనలు, సస్యరక్షణపై అవగాహన**



**శ్రీరంగాపూర్, ఆగస్టు 31 (జనంసాక్షి):** తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం (TRVK) వనపర్తి సమన్వయకర్త డా. ఎన్. నవత, (RARS) పాలెం శాస్త్రవేత్త డా.ఎం. శంకర్, శాస్త్రవేత్త శోభా రాథోడ్ ఆధ్వర్యంలో శ్రీరంగాపూర్ మండలంలోని షేర్‌పల్లి, నగరాల, జనంపేట, వెంకటా పూర్ గ్రామాల్లో నిర్ధారణాత్మక క్షేత్ర సందర్శన చేపట్టారు.వరి, మినుము, వేరుశనగ, పత్తి పంటలను పరిశీలించి రైతులకు తగిన సూచనలు చేశారు.

**వరి:**నేరుగా విత్తిన వరిలో జింక్, ఇనుము లోపం గుర్తించారు. నివారణకు జింక్ సల్ఫేట్, ఫెరస్ సల్ఫేట్ (అన్నభేది) 5 గ్రా + నిమ్మ ఉప్పు 1 గ్రా / లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. నాట్లు వేసిన వరిలో కలుపు నివారణకు బిస్పైరిబాక్ సోడియం 10% వాడాలని సూచించారు.

**మినుము:** లద్దె పురుగు ఉధృతి గుర్తించారు. ఎమామెక్టిన్ బెంజోయేట్ 5% SG పిచికారీ చేయాలని సూచించారు.

**వేరుశనగ:** కలుపు నివారణకు ఇమాజెథాపైర్ 10% (SL) వాడాలన్నారు.పత్తి: రసం పీల్చే పురుగులైన తెల్లదోమ, పేనుబంక ఉధృతి గుర్తించారు. ఫ్లానికామిడ్ 50% (WG) వంటి మందులు మార్చి మార్చి వాడాలని, సమగ్ర సస్యరక్షణ పాటించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హైమావతి, ాజులాల శివ, సాయి రెడ్డి మరియు రైతులు పాల్గొన్నారు.

### డీసీసీ డాక్టర్ సెల్

## జిల్లా ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్



**వెల్దండ, ఆగస్టు 31 (జనంసాక్షి):** వెల్దండ మండలం కుప్పగండ్ల గ్రామానికి చెందిన డా. ఎం. విజయ్‌కుమార్ ను జిల్లా కాంగ్రెస్ కమిటీ డీసీసీ డాక్టర్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు.ఈ నియామక ఉత్తర్వులను డా. హరికాంత్ రెడ్డి జనరల్ సెక్రటరీ, టీపీసీసీ డాక్టర్ సెల్,తెలంగాణ ఇన్‌చార్జ్ డా. దిలీప్ రెడ్డి, చైర్మన్, డాక్టర్ సెల్, నాగర్‌కర్నూల్ జిల్లా జారీ చేశారు.ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించినందుకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి,మరియు డిసిసి అధ్యక్షులు డా. వంశీకృష్ణలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.అలాగే తన నియామకానికి సహకరించిన టిపిసిసి డాక్టర్ సెల్ నాయకత్వానికి, జిల్లా కాంగ్రెస్ నాయకులకు మరియు పార్టీ శ్రేణులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధత, నిజాయితీ, అంకితభావంతో నిర్వర్తిస్తూ, నాగర్‌కర్నూల్ జిల్లాలో డాక్టర్ సెల్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు వైద్యులు, వైద్య సిబ్బంది మరియు ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు.

## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి: కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 31 (జనంసాక్షి):** చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతనిస్తూ, నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించే వరకు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక విద్యార్థులు, క్రీడాకారులకు సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. భేటీ బచావో్-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఇటీవల ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాలల కౌమార బాలికలకు నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేసి అభినందించారు. నారాయణపేట జిల్లా నుంచి జాతీయ స్థాయి క్రీడాకారులు, రాష్ట్ర స్థాయి ఛాంపియన్లు ఉండటం సంతోషకర మన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, పీఈటీలు, ఉపాధ్యాయులు, అధికారులను అభినందించారు. జిల్లాలో క్రీడా మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు సమీకరించి స్టేడియాన్ని మెరుగుపరుస్తామని తెలిపారు. జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లే క్రీడాకారులకు ప్రభుత్వ నిబంధనల మేరకు రవాణా తదితర అంశాల్లో సాధ్యమైనంత సహకారం అందిస్తామని చెప్పారు. బాలల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు క్రీడలు కూడా అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి తిరిగి విద్యలోకి తీసుకురావడంతో పాటు క్రీడల్లోనూ అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. చదువు, క్రీడలు, జీవితంలో విజయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. అనంతరం జాతీయ, జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు, శాలువాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ రాజేందర్ గౌడ్, డీవైఎస్ఓ వెంకటేష్ శెట్టి, డీపీఆర్ఓ రషీద్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కోచ్‌లు, పీఈటీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే బీరం జన్మదిన వేడుకల్లో గులాబీ సందడి





**కొల్లాపూర్, ఆగస్టు 31 (జనంసాక్షి):** బీఆర్ఎస్ కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి 48వ జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లాపూర్ పట్టణంలో గులాబీ జెండాలతో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. ఎన్మనబెట్ల గ్రామం నుంచి సర్పంచ్ సింధుజ సురేందర్‌రావు ఆధ్వర్యంలో, అలాగే మాధవస్వామి ఆలయం సమీపం నుంచి మరో ర్యాలీ ప్రారంభమై పాత బస్టాండ్, అల్లూరి సీతారామరాజు విగ్రహం, గ్రామపంచాయతీ కమాన్, ఎన్టీఆర్ చౌరస్తా మీదుగా కొనసాగింది. అనంతరం 48 కేజీల కేక్‌ను కట్ చేసి హర్షవర్ధన్‌రెడ్డికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సింగోటం గ్రామానికి చెందిన హర్షవర్ధన్‌రెడ్డి 1978 ఆగస్టు 31న జన్మించారు. 2001లో ఎల్‌ఎల్‌బీ పూర్తిచేసి సుమారు పదేళ్లు హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. అనంతరం రాజకీయాల్లోకి ప్రవేశించారు. టీడీపీతో రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, వైఎస్సార్ కాంగ్రెస్, కాంగ్రెస్‌లో పనిచేశారు. 2014లో కొల్లాపూర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2018లో అదే పార్టీ తరపున పోటీ చేసి జూపల్లి కృష్ణారావుపై 12,543 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2019లో టీఆర్ఎస్‌లో చేరి, అనంతరం బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నారు. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి జూపల్లి కృష్ణారావు చేతిలో ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం బీఆర్ఎస్ కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. జన్మదిన వేడుకల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, యువత, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### హెచ్‌టీ పత్తి

## ప్రతికూల ప్రభావాలపై అవగాహన

- **నూనెగింజల పంటల సాగుకు ప్రోత్సాహం**



**రేవల్లి, ఆగస్టు 31 (జనంసాక్షి):** వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఏటీఎంఏ) ఆధ్వర్యంలో రేవల్లి మండలంలోని రేవల్లి రైతు వేదికలో సోమవారం రికగ్నిషన్ ప్రియర్ లెర్నింగ్ (ఆర్పీఎల్) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌టీ పత్తి సాగు వల్ల కలిగే ప్రతికూల ప్రభావాలు, నూనెగింజల పంటల ప్రోత్సాహంపై రైతులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా డా. భవాని, ఎక్స్‌టెన్షన్ సైంటిస్ట్ మాట్లాడుతూ, హెచ్‌టీ పత్తి సాగు వల్ల నేల ఆరోగ్యం, పర్యావరణం, వ్యవసాయ జీవవైవిధ్యంపై కలిగే ప్రభావాలను రైతులు అర్థం చేసుకోవాలని సూచించారు. అధికంగా రసాయనాల వినియోగాన్ని తగ్గించి, శాస్త్రీయ పద్ధతుల్లో పంటల సాగు చేపట్టాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రేవల్లి సర్పంచ్ రాజయ్య, డిప్యూటీ సర్పంచ్ సుధాకర్ రెడ్డి, నాగాపూర్ సర్పంచ్ లోడే అంజలమ్మ, డిప్యూటీ సర్పంచ్ నదిమింటి అశ్విని, శనాయిపల్లి సర్పంచ్ మేకల కృష్ణయ్య, డిప్యూటీ సర్పంచ్ మండ్ల అంజనేయులు, మార్కెట్ యార్డు డైరెక్టర్లు సిరిమల్లేష్, కనకట్ల తిరుపతయ్య, బీఎఫ్‌పీసీ సభ్యులు ఎస్. నారాయణ రెడ్డి, రేవల్లి ఎం.డి. సుల్తాన్ అలీ, ఏఈఓ లు అన్ని గ్రామాల రైతులు పాల్గొన్నారు.

### భూ రీసర్వే పనులను

## వేగవంతం చేయాలి: కలెక్టర్




**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 31 (జనంసాక్షి):** భూ రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి వేగవంతం చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో భూ రీసర్వే, 22-ఏ, రెవెన్యూ సమస్యలపై సమీక్ష నిర్వహించారు.

పాత భూ రికార్డులను భూ భారతి, ఐజీఆర్ఎస్‌లోని ప్రస్తుత వివరాలతో పోల్చి ఖచ్చితమైన డేటా సిద్ధం చేయాలని సూచించారు. వ్యవసాయ, వ్యవసాయేతర, ప్రభుత్వ, పట్టా, ప్రైవేట్ భూములను కేటగిరీల వారీగా గుర్తించి విస్తీర్ణంలో తేడాలను పరిశీలించాలని తెలిపారు. పీఓబీ, అటవీ, ఇరిగేషన్, చెరువుల భూములను నిబంధనల ప్రకారం నమోదు చేయాలని ఆదేశించారు.

22-ఏలో తప్పుగా నమోదైన భూములను ఆధారాలతో పరిశీలించి సరిచేయాలని, పెండింగ్ రెవెన్యూ, సాదా బైనామా సమస్యలను నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# సంచార జాతుల అభ్యున్నతికి ప్రత్యేక దృష్టి సారించాలి

**• కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 31(జనంసాక్షి):** సంచార జాతుల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు. విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబనతో పాటు సామాజికంగా గౌరవప్రదమైన జీవనం సాగించేలా వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. సంచార జాతుల 75వ విముక్తి దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి చేన్నయ్య తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మహాత్మా జ్యోతిబా ఫూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సంచార, విముక్త జాతుల చరిత్రను, వారు ఎదుర్కొన్న సామాజిక పరిస్థితులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, గతంలో వివిధ కారణాలతో సామాజికంగా వెనుకబడిన ఈ వర్గాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యకు ప్రాధాన్యత కల్పించడం ద్వారా వారి పిల్లలకు మెరుగైన భవిష్యత్తును అందించవచ్చన్నారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా క్షేత్రస్థాయిలో అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు. పథకాల ప్రయోజనాలు పొందడంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. సంచార జాతుల ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.

సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు, సమాన గౌరవం లభించినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పేర్కొన్నారు. సంచార, విముక్త జాతుల సంక్షేమం కోసం అధికారులు, కుల సంఘాల నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సహాయ అధికారి శ్రీరాములు, బీసీ సంఘాల ప్రతినిధులు, సంచార జాతుల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులకు వారంలో అక్రిడిటేషన్లు



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 31 (జనంసాక్షి):** అక్రిడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి జర్నలిస్టుకు వారం రోజుల్లో కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ హామీ ఇచ్చారు. సోమవారం ప్రజావాణి సమావేశ భవనంలో టీయూడబ్ల్యూజే (హెచ్-143) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్లా ఖాన్, రాష్ట్ర నాయకులు చందు నాయక్, హౌదేకార్ ఉమాశంకర్, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఖానాపురం ప్రదీప్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియలో జరుగుతున్న జాప్యాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

అర్హత కలిగిన వర్కింగ్ జర్నలిస్టులకు కొందరు ఉద్దేశపూర్వకంగా ఫిర్యాదులు చేస్తూ అక్రిడిటేషన్లు రాకుండా అడ్డుకుంటున్నారని, నిబంధనల ప్రకారం అర్హతలను పరిశీలించి కార్డులు మంజూరు చేయాలని కోరారు. నల్లమల ప్రాంతంలోని మన్ననూర్, దోమలపెంట కేంద్రాల్లో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు ప్రత్యేక సర్క్యులర్ ప్రకారం కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగ సీనియర్ ఫొటో జర్నలిస్టు ప్రసాద్‌కు పెన్షన్ వస్తుందనే కారణంతో కార్డు మంజూరులో ఇబ్బంది కలగకుండా అర్హతను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. అర్హులైన ఫ్రీలాన్స్ జర్నలిస్టులకు కూడా అక్రిడిటేషన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సమస్యలను విన్న కలెక్టర్ సానుకూలంగా స్పందించి, అర్హులైన వారికి వారం రోజుల్లో అక్రిడిటేషన్లు అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ మూడో విడతలో 300 మందికి పైగా జర్నలిస్టులు అక్రిడిటేషన్ల కోసం దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్నారని తెలిపారు. కలెక్టర్ హామీపై వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు, యూనియన్ నాయకులు, ఫొటో, వీడియో, డెస్క్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి: బీజేపీ




**వనపర్తి బ్యూరో, ఆగస్టు 31 (జనంసాక్షి):** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో నిరసన, ఒకరోజు నిరాహార దీక్ష నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అరవింద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బీజేపీ జిల్లా ఇన్‌చార్జి బొక్క బాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు, స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందక లక్షలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫీజులు చెల్లించకపోవడంతో పలు కళాశాలల్లో విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిచిపోతున్నాయని, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల విషయంలో వారు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బాల్‌రెడ్డి విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే బకాయిలు విడుదల చేయాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే తెలంగాణ అసెంబ్లీని ముట్టడిస్తామని స్పష్టం చేశారు.

**ప్రైవేట్ కళాశాలల లెక్చరర్ల సంఘం మద్దతు...**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం బీజేపీ చేస్తున్న పోరాటానికి ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాలల లెక్చరర్ల సంఘం మద్దతు ప్రకటించింది. సంఘం ప్రతినిధులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. విద్యార్థుల సమస్యలపై రాజకీయాలకు అతీతంగా బీజేపీ చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సబిరెడ్డి వెంకటరెడ్డి, మున్నూరు రవీందర్, శ్రీశైలం, అనుజ్ఞారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పెద్దిరాజు, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణగౌడ్, గజరాజుల తిరుమలేష్, కంచ ఆంజనేయులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

**• అధికారులకు జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశం**



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 31 (జనంసాక్షి):** ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించే ఫిర్యాదులు, వినతులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం నాగర్‌కర్నూల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా 64 ఫిర్యాదులు, వినతిపత్రాలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన దరఖాస్తులను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. సమస్యల స్వభావం, సంబంధిత శాఖలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును నిర్లక్ష్యం చేయకుండా క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. అర్హత కలిగిన సమస్యలను నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని, ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. దరఖాస్తుదారులకు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చెన్నయ్య, దేవసహాయం, డీఆర్ఓ పాండు, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మద్దెలబండ పశువైద్య ఉపకేంద్రంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బోర్డు

**• తెలంగాణ ప్రభుత్వ అనిబోర్డు మార్చని అధికారులు**



**మల్దకల్, ఆగస్టు 31 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం మద్దెలబండ గ్రామంలోని గ్రామీణ పశు వైద్య ఉపకేంద్రంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ గ్రామీణ పశు గణాభివృద్ధి ఉపకేంద్రం డిపిఏపీ అని బోర్డు ఉన్నది. కానీ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి దాదాపు పది సంవత్సరాలు దాటిన నేటికీ ఇంకా ప్రభుత్వ కార్యాలయంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనే బోర్డు కనిపిస్తున్నాయి. పశు వైద్య కేంద్రంలో పనిచేస్తున్న ఎల్ ఎస్ ఏ కాంపౌండర్ పనిచేస్తున్న బోర్డు మాత్రం కనిపించడం లేదని అని పలువురు చర్చించుకుంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు ఎంతమంది అధికారులు ఈ పశువైద్య గ్రామీణ వైద్యశాలలో పని చేసిన అధికారులు కూడా కనిపించలేదా..అని లేదా కావాలని మనకేమి పట్టినట్టుగా వ్యవహరించి నిర్లక్ష్యంగా అధికారులు ఉన్నారని గ్రామస్తులు పలువురు మేధావులు ఆరోపిస్తున్నారు. అధికారులకు ఇంకా ఆంధ్ర ప్రదేశ్ వైపు మొగ్గు చూపుతున్నారని,ఎందుకు ఇంత నిర్లక్ష్యం చేస్తున్నారని, బోర్డు కూడామార్పు చేయని అధికారులు ఉన్నారంటే వారికి తెలియాలి,జిల్లా అధికారులు కూడా ఎన్నోసార్లు ఆసుపత్రిని తనిఖీలు చేసినప్పుడు కూడా చూడలేదా.. పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే కార్యాలయం పై బోర్డు మార్పు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# క్రమశిక్షణ, నిజాయితీకి ప్రతీక వెంకటేశ్వర్లు గౌడ్

**• ఏఎస్సైగా పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మానం - ఎస్పీ సునిత రెడ్డి**



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 31 (జనంసాక్షి):** పోలీసుశాఖలో క్రమశిక్షణ, నిజాయితీ, విధి నిబద్ధతతో విశిష్ట సేవలందించిన వనపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్ ఏఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ పదవీ విరమణ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్ ఆయనను, ఆయన సతీమణిని శాలువాలు, పూలమాలలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించిన ఆయన నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లోనూ ధైర్యసాహసాలతో సేవలందించారని ఎస్పీ కొనియాడారు. సుదీర్ఘ సర్వీసులో ఎలాంటి ప్రతికూల వ్యాఖ్యలకు తావులేకుండా విధులు నిర్వర్తించడం ఆయన నిష్కళంక సేవలకు నిదర్శనమన్నారు. విధి నిబద్ధత, ప్రజల పట్ల మానవీయ దృక్పథం, సహోద్యోగులతో స్నేహపూర్వక వైఖరి యువ పోలీసులకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు. ప్రభుత్వం అందించే జీపీఎఫ్, ఇన్సూరెన్స్ తదితర పదవీ విరమణ ప్రయోజనాలను సక్రమంగా అందేలా చూడాలని, ఆర్థిక ప్రయోజనాలు, బకాయిలను త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ బాలాజీ నాయక్, పోలీసు కార్యాలయం ఏఓ సునంద, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, వనపర్తి రూరల్ ఎస్సై హృషికేష్ తదితర అధికారులు, పోలీసు సిబ్బంది, వెంకటేశ్వర్లు గౌడ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### పైరవీలకు తావులేదు..

# నిర్భయంగా పోలీసులను ఆశ్రయించండి

- ప్రజావాణిలో 13 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ సునిత రెడ్డి



వనపర్తి బ్యూరో, ఆగస్టు 31 (జనంసాక్షి): ప్రజలు ఎలాంటి పైరవీలు, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీసులను సంప్రదించి తమ సమస్యలను చట్టపరంగా పరిష్కరించుకోవాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, సూచించారు.జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 13 మంది ఫిర్యాదుదారుల నుంచి ఎస్పీ అర్జీలను స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా విని, వాటి పరిష్కారానికి సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలను న్యాయబద్ధంగా, సత్వరమే పరిష్కరించాలని ఎస్సైలు, సీఐలను ఆదేశించారు. ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడంతో పాటు వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం, శాంతిభద్రతలను సమర్థవంతంగా పరిరక్షించడమే జిల్లా పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని ఎస్పీ తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా నేరుగా పోలీసులను సంప్రదించాలని కోరారు.ప్రజల ఫిర్యాదులను నేరుగా స్వీకరించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కారం చూపేందుకు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## నిరుపేద గిరిజన విద్యార్థినికి అండగా మర్రి జనార్దన్‌రెడ్డి



తాడూర్, ఆగస్టు 31(జనంసాక్షి): పేదరికంతో ఏ విద్యార్థి ఉన్నత విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు మర్రి జనార్దన్‌రెడ్డి మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. ఎంజెఆర్ ట్రస్ట్ ద్వారా నిరుపేద గిరిజన విద్యార్థిని అనూషకు వరుసగా రెండో ఏడాది రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు.

తాడూర్ మండలం పర్వతాయిపల్లి తండాకు చెందిన ముడావత్ సత్యం కుమార్తె అనూష హైదరాబాద్‌లోని శ్రీ హిందూ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతోంది. కళాశాలలో ఉచిత సీటు లభించినప్పటికీ హాస్టల్ ఫీజు చెల్లించే స్తోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం మర్రి జనార్దన్‌రెడ్డి దృష్టికి వెళ్లింది. దీంతో వెంటనే స్పందించిన ఆయన గత నెలలో మొదటి సంవత్సరం హాస్టల్ ఫీజు కోసం రూ.50 వేల సహాయం అందించారు. తాజాగా రెండో సంవత్సరం హాస్టల్ ఫీజు కోసం మరో రూ.50 వేల చెక్కును అందజేశారు.

ఈ సందర్భంగా మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ పేదరికం ఏ బిడ్డ భవిష్యత్తుకు అడ్డంకి కాకూడదన్నారు. ముఖ్యంగా గిరిజన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. విద్యే పేదరిక నిర్మూలనకు ప్రధాన మార్గమని, ప్రతిభావంతులైన విద్యార్థుల చదువుకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారకుండా ఎంజెఆర్ ట్రస్ట్ ద్వారా సహాయం కొనసాగిస్తామని తెలిపారు. ఆర్థిక సహాయం అందడంతో అనూష, కుటుంబ సభ్యులు మర్రి జనార్దన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తికి వెంకటరమణ సేవలు అభినందనీయం

- గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ
- తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర
- మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి
- చేర్యాలలో ఘనంగా పదవి విరమణ వేడుకలు



చేర్యాల, ఆగస్టు 31(జనంసాక్షి): ఉపాధ్యాయ వృత్తికి వెంకటరమణ చేసిన సేవలు అభినంద నీయమని జాతీయ అవార్డు గ్రహీత గేయ, రచయిత సుద్దాల అశోక్ తేజ, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. దొమ్మాట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు పాశికంటి వెంకటరమణ పదవి విరమణ వేడుకలు సోమవారం స్థానిక కళ్యాణి గార్డెన్ ఘనంగా జరిగాయి. అంతకు ముందు విద్యార్థుల నృత్యాలు, జానపద కళాకారుల పాటలు అలరిం చాయి. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సభకు కే. శ్రీనివాస్ అధ్యక్షత వహించగా సమన్వయంగా ఉపాధ్యాయులు మంగళగిరి రామచంద్ర మూర్తి వ్యవహరించారు. పదవి విరమణ పొందుతున్న కొత్త దొమ్మాట ప్రధానోపాధ్యాయురాలు వెంకటరమణ– సుధాకర్ లను శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డిలు మాట్లాడుతూ.. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిని నమ్ముకుని ఎంతోమంది విద్యార్థులను భావి భారత పౌరు లుగా తీర్చిదిద్ది తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. పదవి విరమణ సహజమని అన్నారు.

# 1000 రోజుల కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ సమరశంఖం





నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 31 (జనంసాక్షి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ వైఫల్యాలు, హామీల అమలులో జాప్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ సమరశంఖం పూరించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఏడు రోజుల పాటు విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం నాగర్‌కర్నూల్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ సందర్భంగా మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సమయంలో 100 రోజుల్లో ఆరు గ్యారంటీలతో పాటు 420 హామీలను అమలు చేస్తామని ప్రకటించిందని, అయితే వాటి అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఏ హామీలు అమలయ్యాయి, ఏవి పెండింగ్‌లో ఉన్నాయి, వాటి వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వాస్తవాలు, అధికారిక గణాంకాలతో గ్రామ గ్రామాన ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రతి గ్రామాన్ని సందర్శించి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని నాయకులను కోరారు. జిల్లా, మండల కేంద్రాల్లో ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు చేపట్టాలని, సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగించాలని అన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, ఉద్యోగాల భర్తీ, నోటిఫికేషన్లపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రైతుబంధు, రుణమాఫీ, సాగునీరు, ఎరువులు, విత్తనాలు, విద్యుత్ సమస్యలను తెలుసుకుని రైతులతో సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలపై పోరాడాలని, గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని కోరారు. సమావేశంలో వివిధ మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి



మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 31 (జనంసాక్షి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. వారి సమస్యలను సావధానంగా విని, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రజావాణిలో మున్సిపల్, పంచాయతీరాజ్, నీటిపారుదల, సంక్షేమం, వ్యవసాయం, పౌరసరఫరాలు, భూ రికార్డులు, గృహ నిర్మాణం, విద్య, వైద్యం, విద్యుత్, పోలీస్, అటవీ తదితర శాఖలకు సంబంధించిన 87 వినతులు స్వీకరించారు.

**అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష...**

ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను లక్ష్యాల మేరకు వేగవంతంగా అమలు చేయాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని అన్నారు. వనమహోత్సవంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటి జియోట్యాగింగ్ చేయాలని, వాటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చేయూత పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, గ్రామీణాభివృద్ధి తదితర పథకాల ప్రయోజనాలు అర్హులకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. జిల్లా అధికారులకు కేటాయించిన మండలాలను స్పెషల్ ఆఫీసర్లుగా పర్యవేక్షించి, క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. మండల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అన్నారు. ప్రతి శాఖ లక్ష్యాలపై వారానికొకసారి సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయడంతో పాటు ఉపాధి హామీ పనులను కూడా పెంచాలని సూచించారు. ప్రజావాణి, ఆర్టీఐ, కోర్టు కేసులు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ అంశాలతో పాటు అన్ని పెండింగ్ వ్యవహారాలను నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. సమావేశంలో డీఆర్వో ఏ. నిర్మల, డీఆర్డీఓ నర్సింహులు, డీపీఓ వెంకటరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ పోరుబాట

- సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు ఏడు రోజుల నిరసనలు
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి, ఆగస్టు 31 (జనంసాక్షి): కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలు, ఎన్నికల హామీల అమలులో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పోరుబాటకు సిద్ధమైంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు 'కాంగ్రెస్ 1000 రోజుల పాలన–420 మోసాలు' పేరుతో సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు నిర్వహించనున్న కార్యక్రమాలపై సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ నియోజకవర్గ నాయకులకు దిశానిర్దేశం చేశారు.

నాలుగు మండలాలు, రెండు మున్సిపాలిటీల ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో ఏడు రోజుల కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వాటి అమలులో విఫలమైందని ఆరోపించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి, 'బాకీ కార్డులు' గడపగడపకు పంపిణీ చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

**కార్యాచరణ ఇలా..**

సెప్టెంబర్ 2: ధర్నాలు, బాకీ కార్డుల పంపిణీ, 420 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శన.

సెప్టెంబర్ 3: రైతు సదస్సులు, వ్యవసాయం, సాగునీరు, విద్యుత్, యూరియా, రైతుబీమాపై చర్చలు.

సెప్టెంబర్ 4: వృద్ధులు, వికలాంగులు, మహిళలతో సదస్సులు, వంటావార్పు.

సెప్టెంబర్ 5: విద్యార్థులు, యువత సమస్యలపై ర్యాలీలు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ తదితర అంశాలపై నిరసనలు.

సెప్టెంబర్ 6: గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య సమస్యలపై నిరసనలు.

సెప్టెంబర్ 7: ప్రజావాణి కేంద్రాల్లో 420 హామీల అమలుపై వినతిపత్రాలు.

సెప్టెంబర్ 8: జిల్లా కేంద్రంలో ప్రెస్‌మీట్, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం.

సెప్టెంబర్ 10న ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నిరసనలకు బీఆర్ఎస్ సంఘీభావం ప్రకటించనుంది.

సమావేశంలో పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల పాలనలో తెలంగాణలో సంస్కరణల జోరు



**సిద్దిపేట బ్యూరో, ఆగస్టు 31 (జనంసాక్షి):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూనే అభివృద్ధి, సంక్షేమం, సంస్కరణలకు ప్రాధాన్యం ఇస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పాలన సాగిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఇప్పటివరకు సుమారు రూ.12,075 కోట్ల ప్రయోజనం కల్పించామని, రాష్ట్రంలోని 580 మండలాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించే దిశగా చర్యలు చేపట్టామని తెలిపారు. మహిళా సంఘాలను బస్సుల నిర్వహణలో భాగస్వాములను చేస్తున్నామని, వాహన సారథి, ఈవీ, స్క్రాప్ పాలసీలు, చెక్‌పోస్టుల రద్దు వంటి సంస్కరణలు అమలు చేస్తున్నామని చెప్పారు.

బీసీ గురుకులాలు, హాస్టళ్లలో డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచి నాణ్యమైన భోజనం అందిస్తున్నామని, ఇంటిగ్రేటెడ్ హాస్టళ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలు అమల్లో ఉన్నాయని చెప్పారు. రైతు భరోసాకు రూ.36 వేల కోట్లు, రుణమాఫీకి సుమారు రూ.20 వేల కోట్లు, ధాన్యం కొనుగోళ్లకు రూ.35 వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు. 72 వేల ఉద్యోగాలు భర్తీ చేసి, 16 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు అందించామని తెలిపారు. మహిళా సంఘాలకు రూ.60,487 కోట్ల బ్యాంకు లింకేజీ, రూ.1,900 కోట్ల వడ్డీ రాయితీ అందించామని చెప్పారు. 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల భూసేకరణ కొనసాగుతోందని, రైతుల సహకారంతో పనులు త్వరగా పూర్తి చేసి సాగునీరు అందిస్తామని మంత్రి తెలిపారు. 'పల్లె పల్లెకు పొన్నమన్న' కార్యక్రమంతో గ్రామాల్లో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు.

హుస్నాబాద్‌లో పరిశ్రమలు, పర్యాటకం, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల అభివృద్ధితో పాటు అర్బన్ ఫారెస్ట్, యూనివర్సిటీ, ఇంటిగ్రేటెడ్ కాలేజీ, 200 పడకల ఆస్పత్రి, పీజీ కాలేజీ, నాలుగు లైన్ల రహదారుల అభివృద్ధి చేపడుతున్నామని వివరించారు. గిరిజన తండాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, నియోజకవర్గంలో ఒక్క ఎకరం భూమి బీడుగా ఉండకూడదన్నదే లక్ష్యమన్నారు. మిగిలిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

# నందిగామ నల్లకుంట ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

- ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు నందిగామ గ్రామస్తుల వినతి







**సంగారెడ్డి, ఆగస్టు 31 (జనంసాక్షి):**
సంగారెడ్డి జిల్లా పటాన్చెరువు మండలం నందిగామ గ్రామ పరిధిలోని నల్లకుంట సుమారు 2.5 ఎకరాలు ఆక్రమానికి గురైందని, వెంటనే సమగ్ర విచారణ చేపట్టి ఆక్రమణలను తొలగించి నల్లకుంటను పరిరక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పాండుకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.

గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 78లో నల్లకుంట 10.16 పంట విస్తీర్ణంలో ఉందన్నారు. గత కొంతకాలంగా నల్లకుంట, భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించి పంట పొలాలుగా మార్చుకున్నారని ఆరోపించారు. నల్లకుంట భూమిని ఆక్రమించడమే కాకుండా, దానిని క్రయ విక్రయాలకు ఉపయోగిస్తున్నారంటూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నల్లకుంట ఆక్రమణల కారణంగా నందిగామ మత్స్యకారులకు జీవన విధానంలో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమానికి గురైన నల్లకుంట భూములపై అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి, హద్దులను గుర్తించాలని కోరారు. ఆక్రమణలు నిజమని తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, కుంట భూమిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అలాగే నల్లకుంట చెరువును పూర్తిస్థాయిలో పరిరక్షించేందుకు చర్యలు చేపట్టి, భవిష్యత్‌లో ఎలాంటి ఆక్రమణలు జరగకుండా అధికారులు పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని కోరారు. తమ ఫిర్యాదుపై అధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలని నందిగామ గ్రామస్తులు అదనపు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో నందిగామ గ్రామస్తులు సుమన్, విక్రమ్ కుమార్, శ్రీరాములు, నాగరాజు, వెంకటేష్, రవీందర్, బాలయ్య, యాదయ్య, కృష్ణయ్య, పాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమమే ముఖ్యం

- హాస్టళ్లలో సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి: ఎమ్మెల్యే సంజీవరెడ్డి



**నారాయణఖేడ్, ఆగస్టు 31 (జనంసాక్షి):** విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతి, నాణ్యమైన భోజనం, విద్యా సౌకర్యాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సూచించారు. నారాయణఖేడ్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజనం, తాగునీరు, పరిశుభ్రత, ఆరోగ్యం, వసతి తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, చదువుపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. హాస్టళ్లలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వసతి వంటి మౌలిక సదుపాయాల్లో ఎలాంటిలోటుపాట్లు లేకుండా చూడాలని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం అనేక పథకాలు, సదుపాయాలను కల్పిస్తోందని, వాటి ప్రయోజనాలు ప్రతి అర్హుడైన విద్యార్థికి పూర్తిస్థాయిలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యంగా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగేలా అవసరమైన సహకారం అందించాలన్నారు.

హాస్టళ్లలో విద్యార్థులకు ఇంటి వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని HWOలకు సూచించారు. విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆదేశించారు. సమీక్ష సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## గంజాయి విక్రయిస్తున్న

# ఇద్దరి అరెస్ట్-5 కేజీల గంజాయి, బైక్ స్వాధీనం

**గద్వాల, ఆగస్టు 31(జనంసాక్షి):** గద్వాల పట్టణంలో అక్రమంగా గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను గద్వాల టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.సోమవారం గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గద్వాల డీఎస్పీ వై.మొగులయ్య కేసు వివరాలను వెల్లడించారు.పోలీసుల తనిఖీల్లో దొరికిన నిందితులు, ఇటిక్యాల మండలం శనిగెపల్లి గ్రామానికి చెందిన బీసన్న, మల్దకల్ మండలం విఠాలపురం గ్రామానికి చెందిన గోకారి అనే ఇద్దరు వ్యక్తులు తమ ఇంట్లో సాగు చేస్తున్న గంజాయిని విక్రయించేందుకు గద్వాల పట్టణానికి తీసుకువచ్చారు.ఆదివారం సాయంత్రం గద్వాల టౌన్ ఎస్ఐ కళ్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు మేలచెర్వు చౌరస్తాలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన వీరిద్దరిని తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి.స్వాధీనం చేసుకున్న సొత్తు,నిందితుల నుంచి పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు:5.057 కేజీల గంజాయి,ఒక మోటార్ బైక్, రెండూ సెల్ ఫోన్‌లు,పోలీసుల విచారణలో నిందితులు ఇద్దరూ కలిసి గద్వాల, ఎర్రవల్లి, కొత్తకోట తదితర ప్రాంతాలలో కొంతకాలంగా గంజాయి సరఫరా చేస్తున్నట్లు తేలింది. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో గద్వాల సీఐ టి.శ్రీను, ఎస్ఐ కళ్యాణ్ కుమార్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

- రోడ్డు కోసం బీఆర్ఎస్ పాదయాత్ర.. దారిపొడవునా జననీరాజనాలు
- నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి





**మెదక్ బ్యూరో, ఆగస్టు 31 (జనంసాక్షి):**
గుంతలమయమైన రహదారి, వర్షం పడితే బురదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. వెల్దుర్తి నుంచి శెట్టిపల్లి కలాన్ మీదుగా మెదక్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం భారీ పాదయాత్ర నిర్వహించారు. వెల్దుర్తి నుంచి ఉప్పులింగాపూర్ వైపు సాగిన పాదయాత్రలో బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ హిమాలత శేఖర్‌గౌడ్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. వెల్దుర్తి–మెదక్ రహదారి పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారిందని, వర్షాల సమయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందన్నారు. రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్డు నిర్మాణానికి రూ.11.68 కోట్ల నిధులు మంజూరైనా పనులు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. రెండు టెండర్లు జరిగినా పనులు చేపట్టకపోవడంపై ప్రభుత్వాన్ని నిలదీశారు.

పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల కష్టాలను పట్టించుకోకపోవడమేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. వారం రోజుల్లో ప్రభుత్వం స్పందించి పనులు ప్రారంభించకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని ఎమ్మెల్సీ యాదవ్‌రెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.

## మెరిడియన్ స్కూల్ విద్యార్థిని అఖిల ఎంబీబీఎస్ చదువు బాధ్యత నాదే

- సిద్ధిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు

**సిద్దిపేట బ్యూరో, ఆగస్టు 31 (జనంసాక్షి):**

సిద్ధిపేటలోని మెరిడియన్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌కు మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్న సుమారు 168 మంది విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా పిల్లలతో ఎంతో సరదాగా ముచ్చటించిన ఆయన, సెల్‌ఫోన్ల వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. క్రీడల ప్రాముఖ్యతను గురించి పిల్లలకు స్పష్టంగా అర్థమయ్యేలా చెప్పారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. ఈ రోజుల్లో పిల్లలకు సెల్‌ఫోన్ అనేది ఒక వ్యసనంగా మారిపోయింది. భోజనం చేసేటప్పుడు ఫోన్ చూస్తే తప్ప ముద్ద మింగలేని పరిస్థితికి చాలామంది వచ్చేశారు. ఇదొక ప్రమాదకరమైన పరిణామం. ఈరోజు ఒక ఆస్పత్రి ప్రారంభోత్సవానికి వెళ్లినప్పుడు ఒక ఏడాదిన్నర చిన్నారి సెల్‌ఫోన్‌కు ఎంతలా అడిక్ట్ అయిపోయిందో చూసి ఆశ్చర్యపోయాను. అవసరానికి మొబైల్ వాడుకోవాలి కానీ, దానికి మనం లొంగిపోవద్దు.



చదువు ఎంత ముఖ్యమో, క్రీడలు, ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. ఆటల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే తత్వం అలవడితే.. భవిష్యత్తులో మీ జీవితంలో వచ్చే ఆటుపోట్లను కూడా అంతే ధైర్యంగా ఎదుర్కొనే శక్తి మీకు వస్తుంది. భోజనం చేసేటప్పుడు సెల్‌ఫోన్ చూడకుండా ఉంటామని మీ మీద మీరే ఒట్టేసుకుని నాకు ప్రామిస్ చేయండి. రేపు స్కూల్ డేకు నేను వచ్చినప్పుడు మీ మమ్మీ డాడీని అడిగి తెలుసుకుంటాను. పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరం చేసే బాధ్యతను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా తీసుకోవాలని,
ఈ మెరిడియన్ స్కూల్‌లో చదివిన అఖిల అనే పేద విద్యార్థిని ఎంబీబీఎస్ సీటు సాధించి సిద్దిపేట మెడికల్ కాలేజీలో చేరింది. నాలుగేళ్లు చదివించిన మెరిడియన్ స్కూల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు. ఆ అమ్మాయి ఐదేళ్ల పాటు మెడిసిన్ పూర్తయ్యే వరకు ఆమె చదువుకయ్యే పూర్తి ఖర్చుల బాధ్యతను నేను తీసుకుంటున్నాను. వచ్చే 2026 సంవత్సరంలో గజ్వేల్‌లో స్టేట్ లెవెల్ చెస్ ఛాంపియన్ షిప్ నిర్వహించబోతున్నాం. ఆ టోర్నమెంట్ విజయవంతం కావడానికి నా సంపూర్ణ సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ టోర్నమెంట్‌ను ఇంత అద్భుతంగా నిర్వహించిన పాఠశాల యాజమాన్యానికి, ఉపాధ్యాయులకు నా ప్రత్యేక అభినందనలు అని తెలిపారు.

## కొత్త కాలనీలోని సీసీ రోడ్లు ,డ్రైనేజీలు ,విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ప్రజావాణిలో వినతి

**మాగనూర్, (జనంసాక్షి):**



మాగనూరు మండల కేంద్రంలోని కొత్త కాలనీలో సమస్యలు పరిష్కరించాలని మాగనూరు కాలనీ వాసులు సోమవారం రోజు ఎంపీడీవో ఆఫీసులో ప్రజావాణి కి వినతి పత్రం ఇచ్చారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 1988లో 200 పైచిలుకు ఇండ్ల స్థలాలు ఇవ్వడం జరిగింది అప్పటినుంచి ఇప్పటివరకు కాలనీలో ఏలాంటి అభివృద్ధి పనులు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు వర్షాకాలం వచ్చిందంటే విషపురుగులు పాములు ఇళ్లలోకి వచ్చే పరిస్థితి ఉంది పాము కాటుకు గురై మహిళ మరణించడం జరిగింది అన్నారు. గుంతలు ఏర్పడి రోడ్డు కాలిబాటతో నడవలేని పరిస్థితి ఉంది చిన్న పిల్లలు ఆడుకోవడానికి బయట తిరిగే పరిస్థితి కూడా లేదు పిచ్చి మొక్కలు పెరిగి చెత్తచెదారంతో ఎక్కడి నీళ్లు అక్కడ ఆగి బురద మయంగా మారింది. కావున కాలనీ సమస్యలు దృష్టిలో ఉంచుకొని వెంటనే సిసి రోడ్లు, డ్రైనేజీలు విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఎం పి ఓ కళ్యాణి వారికి ప్రజావాణిలో వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పుంజనూర్ ఆంజనేయులు, పాటి మీది వెంకటయ్య ,టప్ప రమేష్, లంగటి శేఖర్, పుంజనూర్ మహదేవ్, ఆంజనేయులు ,మారెప్ప రాజు, వాబయ్య , తదితరులు పాల్గొన్నారు.

# చేర్యాల నకాషీ కళకు అరుదైన ఘనత..

## తెలంగాణ పల్లె సంస్కృతికి రంగుల అద్దం.. ప్రపంచ వేదికపై ప్రత్యేక గుర్తింపు

**చేర్యాల, ఆగస్టు 31 (జనంసాక్షి):**

ఒకప్పుడు కథలు వినిపించేవారు.. ఇప్పుడు ఆ కథలే చిత్రాలుగా చరిత్రను చెబుతున్నాయి. తెలంగాణ పల్లె జీవితం, జానపద గాథలు, ఆచారాలు, సంప్రదాయాలను రంగుల్లో బంధించిన అరుదైన కళారూపం చేర్యాల నకాషీ చిత్రకళ. సిద్దిపేట జిల్లా చేర్యాల ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఈ సంప్రదాయ కళ తరతరాలుగా కళాకారుల కుటుంబాల్లో కొనసాగుతూ తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటోంది.

**కథను కళ్ల ముందు నిలిపిన కళ...**

పుస్తకాలు, సినిమాలు, టెలివిజన్ వంటి ఆధునిక మాధ్యమాలు అందుబాటులో లేని రోజుల్లో పురాణాలు, జానపద కథలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పేందుకు నకాషీ స్క్రోల్ చిత్రాలను ఉపయోగించేవారు. సంచార కథకులు గ్రామాలు తిరుగుతూ పాటల రూపంలో కథలు చెబుతూ, కథకు అనుగుణంగా పొడవైన వస్త్రంపై చిత్రించిన దృశ్యాలను ఒక్కొక్కటిగా విప్పేవారు.
సాధారణంగా 30 నుంచి 50 అడుగుల పొడవైన వస్త్రంపై కథలోని వివిధ ఘట్టాలను వరుస దృశ్యాలుగా చిత్రించేవారు. ప్రతి చిత్రానికి అనుగుణంగా కథకుడు పాట రూపంలో కథను వినిపించడంతో చూడటం, వినడం కలిసిన ప్రత్యేక కథన మాధ్యమంగా నకాషీ కళ నిలిచింది.

**పురాణాలు.. పల్లె జీవితం**

రామాయణం, మహాభారతం, శ్రీకృష్ణ లీలలు వంటి పురాణ గాథలతో పాటు తెలంగాణ జానపద కథలు, గ్రామీణ వృత్తులు, పండుగలు, ఆచారాలు, సంప్రదాయాలు, వీరగాథలు నకాషీ చిత్రాల్లో ప్రధానంగా కనిపిస్తాయి. అందుకే ఈ చిత్రాలు కేవలం కళాకృతులు కాకుండా తెలంగాణ ప్రజా జీవనానికి దృశ్య చరిత్రగా నిలుస్తున్నాయి.
చేర్యాల నకాషీ చిత్రాలకు ఎరుపు రంగు నేపథ్యం ప్రత్యేక ఆకర్షణ. సన్నని గీతలు, ప్రత్యేక ఆకృతులు, ముఖ కవళికలు, అలంకరణలు ఈ చిత్రాలకు ప్రత్యేక అందాన్ని తెస్తాయి. సంప్రదాయ పద్ధతుల్లో పసుపు, మోదుగ పూలు, నీలిమందు, తామర గింజలు, రంగురాళ్లు వంటి సహజ పదార్థాలతో రంగులను తయారు చేసేవారు.

**తండ్రి కళే ఆశయం.. కుమార్తెలకు జీవన మార్గం**

పూర్వీకుల నుంచి వచ్చిన కళను కాపాడుకోవడంలో నాగిళ్ల కుటుంబం చేస్తున్న కృషి ప్రత్యేకంగా నిలుస్తోంది. తండ్రి నాగిళ్ల గణేష్ కళనే ఆశయంగా తీసుకున్న కుమార్తెలు అశ్విని, యామిని ఉన్నత విద్యను అభ్యసించినప్పటికీ ఆధునిక ఉద్యోగాల వైపు వెళ్లకుండా నకాషీ చిత్రకళనే తమ జీవన మార్గంగా ఎంచుకున్నారు.
తండ్రి వద్ద కళలోని మెళకువలను నేర్చుకుంటూ సంప్రదాయ పద్ధతులకు ఆధునిక ఆలోచనలను జోడిస్తున్నారు. తల్లి వనజ కూడా భర్త, కుమార్తెలకు అండగా నిలుస్తున్నారు. కుటుంబమంతా కలిసి నకాషీ కళను వృత్తిగా కొనసాగిస్తూ వారసత్వాన్ని భావితరాలకు అందిస్తోంది.

**దేశ సరిహద్దులు దాటి ప్రపంచ గుర్తింపు...**

నాగిళ్ల కుటుంబం రూపొందించిన నకాషీ చిత్రాలు దేశంలోని పలు ప్రాంతాలతో పాటు విదేశాల్లోనూ ప్రదర్శించబడ్డాయి. అంతర్జాతీయ కళా






ప్రదర్శనల్లో పాల్గొంటూ తెలంగాణ పల్లె సంస్కృతి, జానపద జీవన వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు. వారి కళకు ప్రశంసలు, సన్మానాలు, పురస్కారాలు లభించాయి.
చేర్యాల నకాషీ చిత్రకళకు భౌగోళిక గుర్తింపు (జీఐ) లభించడం ఈ కళకు మరింత గౌరవాన్ని తీసుకొచ్చింది. దీంతో తెలంగాణ సంప్రదాయ కళగా దేశ, విదేశాల్లో గుర్తింపు పెరిగింది.

**కళకు గుర్తింపు ఉన్నా.. కళాకారులకు కష్టాలే**

ఆధునిక వినోద సాధనాల రాకతో సంప్రదాయ కథకుల సంఖ్య తగ్గిపోవడంతో స్క్రోల్ చిత్రాలకు ఆదరణ కూడా తగ్గింది. నేటికీ పూర్వీకుల కళను కాపాడుతున్న అనేక మంది కళాకారులకు స్థిరమైన ఉపాధి, తగిన ఆదాయం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
కళను కాపాడుకోవాలంటే ముందుగా కళాకారుడిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని కళాభిమానులు పేర్కొంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళాకారులకు స్థిరమైన ఉపాధి, ఆర్థిక సహాయం, శిక్షణ, మార్కెటింగ్ సదుపాయాలు, ప్రదర్శన అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు.








**యువతకు చేరువైతే.. భవిష్యత్తు బంగారమే**

కాలానుగుణంగా నకాషీ కళాకారులు చిన్న చిత్రాలు, గోడ అలంకరణలు, ముఖవాడాలు, బొమ్మలు, ఇతర కళాకృతులను రూపొందిస్తూ సంప్రదాయానికి కొత్త ఊపిరి పోస్తున్నారు. యువతను ఈ కళ వైపు ఆకర్షించి శిక్షణ, మార్కెటింగ్, ఆర్థిక ప్రోత్సాహం అందిస్తే నకాషీ కళకు మరింత భవిష్యత్తు ఉంటుందని కళాభిమానులు అంటున్నారు.
చేర్యాల నకాషీ కళ ఒక చిత్రకళ మాత్రమే కాదు.. తెలంగాణ పల్లె జీవితం, ప్రజల ఆచారాలు, సంప్రదాయాలు, జానపద కథలను రంగుల్లో భద్రపరిచిన దృశ్య వారసత్వం. తండ్రి నుంచి కుమార్తెలకు, కుటుంబం నుంచి భావితరాలకు, చేర్యాల నుంచి ప్రపంచ వేదికలకు సాగుతున్న ఈ కళా ప్రయాణం నిజంగా అరుదైన వారసత్వానికి ప్రతీకగా నిలుస్తోంది.
కళను కాపాడాలంటే కళాకారుడిని కాపాడాలి.. కళాకారుడిని ప్రోత్సహిస్తేనే నకాషీ కళ భావితరాలకు సజీవంగా చేరుతుంది.